శనివారం 09.05.2026


INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక


సంపుటి - 34 సంచిక - 17 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


భారత దేశ రాజకీయాలలో సూపర్ స్టార్ , తెలుగు జాతి గర్వించదగ్గ ఆణిముత్యం చంద్రబాబు. భారత దేశంలో ఆయనకు ఉన్న క్రేజ ఏ నాయకులకు లేదు. చంద్రబాబు ఒక వ్యక్తి కాదు సామూహిక శక్తి. ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు సమపాళ్లలో అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నారు.



**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**

# నిరుద్యోగ యువత భవితకు ఎమ్మెల్సీ ఆలపాటి భరోసా



## కేంద్ర ప్రభుత్వ శాఖలు మరియు ప్రభుత్వ రంగ సంస్థలలో ఉద్యోగాల కోసం జరుగు పోటీ పరీక్షలకు

## Free Training for SKILL DEVELOPMENT

**"ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ"**

[ఇంటర్, డిగ్రీ ఆపైన చదివినవారు అర్హులు]

**<< BATCH-II >>**

**రిజిస్ట్రేషన్లు ప్రారంభమైనవి**

ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష :
**10-05-2026**

శిక్షణ ప్రారంభం:
**13-05-2026**

శిక్షణా స్థలము:
HDFC బ్యాంక్ ప్రక్కన,
లక్ష్మీపురం మెయిన్ రోడ్,
గుంటూరు,

**Register Now**

**For Online Entrance Exam**

ప్రవేశ పరీక్ష కొరకు అభ్యర్థులు పైనున్న QR Code ను Scan చేసి రిజిస్ట్రేషన్ చేసుకోగలరు.



**ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, MLC**

Krishna & Guntur Graduates Constituency
Ex.Minister for Technical Education, A.P.

సమాచారం కొరకు:
73374 59888 95536 81118

### ఇరిగేషన్ క్యాలెండర్‌తో
# చంద్రబాబు కొత్త దిశ!



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో సాగునీటి రంగ అభివృద్ధికి కీలక అడుగులు వేస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇరిగేషన్ క్యాలెండర్‌ను ప్రకటించారు. కలెక్టర్ల కాన్ఫరెన్స్ వేదికగా సాగునీటి ప్రాజెక్టుల పూర్తి, శంకుస్థాపనల గడువులను అధికారికంగా వెల్లడించారు. ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం చేపట్టని విధంగా ప్రాజెక్టుల వారీగా స్పష్టమైన కాలపట్టిక ప్రకటించడం విశేషం.

రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల పూర్తి విషయంలో చిత్తశుద్ధితో పనిచేస్తోందనే సంకేతంగా ఈ క్యాలెండర్‌ను సీఎం అభివర్ణించారు. మొత్తం 25 కీలక ప్రాజెక్టుల నిర్మాణం, ప్రారంభం, పూర్తి గడువులను నిర్ణయించారు. ఇందులో పోలవరం, వెలిగొండ, హంద్రీ నీవా సుజల ప్రవంతి, గాలేరు నగరి సుజల ప్రవంతి వంటి ప్రధాన ప్రాజెక్టులు ఉన్నాయి.

సీఎం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం కాటన్ బ్యారేజ్ గేట్ల ఫౌండేషన్ పనులు జూన్ 2026లో ప్రారంభం కానుండగా, పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులు జూలై 2026 నాటికి పూర్తిచేయనున్నారు. వెలిగొండ ఫేజ్-1 ఆగస్టు 2026లో పూర్తికానుండగా, పోలవరం ప్రాజెక్టును జూన్ 2027 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

అలాగే బుడమేరు ఫ్లడ్ ప్రొటెక్షన్, ముక్త్యాల ఎత్తిపోతల పథకం, చింతలపూడి ఎత్తిపోతల పథకం, వంశధార ఫేజ్-2, హంద్రీ-నీవా ఫేజ్-2 వంటి ప్రాజెక్టులకు కూడా నిర్దిష్ట గడువులు ప్రకటించారు. 2028 నాటికి వేదవతి ఎత్తిపోతల పథకం, భైరవాని తిప్ప, అప్పర్ పెన్నార్ ప్రాజెక్టులను పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

ఈ ప్రాజెక్టులు పూర్తయితే రాష్ట్రంలో లక్షల ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు తాగునీటి సమస్యలకు కూడా శాశ్వత పరిష్కారం లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

# రాయలసీమకు 'రాయల్' కళ!



(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి , ఈ వారం జరిగిన తన సమావేశంలో ఈ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపింది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సత్యవేడు మండలంలోని వానెల్లూరు (233.76 ఎకరాలు) మరియు రాళ్లకుప్పం (42.38 ఎకరాలు) గ్రామాలలో ఈ ప్రాజెక్ట్ కోసం 267 ఎకరాల భూమిని కేటాయించింది. ఈ కేంద్రం భారతదేశంలో రాయల్ ఎన్‌ఫీల్డ్ యొక్క రెండవ తయారీ కేంద్రంగా మారనుంది మరియు దీని ద్వారా సుమారు 5,000 ప్రత్యక్ష మరియు పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా.

ప్రధాన తయారీ యూనిట్‌తో పాటు, ఈ ప్రాజెక్ట్‌లో మొదటి దశలో ఒక ప్రత్యేక వెండర్ పార్క్ కూడా ఉంటుంది. ఇది కంపెనీ సరఫరాదారుల వ్యవస్థను ఆంధ్రప్రదేశ్‌కు తీసుకురావడానికి మరియు రాష్ట్రంలో ప్రపంచ స్థాయి ఆటోమోటివ్ తయారీ క్లస్టర్ అభివృద్ధిని వేగవంతం చేయడానికి సహాయపడుతుంది. మొదటి దశను 2029 నాటికి, రెండవ దశను 2032 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఈ అభివృద్ధిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యా, ఐటీ ు ఎలక్ట్రానిక్స్, మానవ వనరుల అభివృద్ధి శాఖల గౌరవ మంత్రి శ్రీ నారా లోకేష్ మాట్లాడుతూ, "రాయల్ ఎన్‌ఫీల్డ్ కేవలం ఒక మోటార్‌సైకిల్ బ్రాండ్ మాత్రమే కాదు – ఇది వారసత్వం, నైపుణ్యం మరియు శాశ్వతమైన నాణ్యతకు ఒక కాలాతీత చిహ్నం. ఈ ప్రతిష్టాత్మక కంపెనీని ఆంధ్రప్రదేశ్‌కు స్వాగతించడం మాకు గర్వకారణం. ఈ పెట్టుబడి, ఆంధ్రప్రదేశ్ యొక్క వ్యాపార వేగానికి, పటిష్టమైన మౌలిక సదుపాయాల వ్యవస్థకు, మరియు భారతదేశంలో అగ్రగామి తయారీ కేంద్రంగా మారాలనే మా నిబద్ధతకు బలమైన మద్దతు. ఈ ప్లాంటుతో పాటు, ఈ ప్రాజెక్ట్ చుట్టూ ఆవిర్భవించే విక్రేతల వ్యవస్థ మరియు అనుబంధ పరిశ్రమలు, ప్రపంచవ్యాప్తంగా పోటీపడగల ఆటోమొబైల్ మరియు అధునాతన తయారీ కేంద్రాన్ని నిర్మించాలనే మా దార్శనికతను గణనీయంగా బలోపేతం చేస్తాయి" అని అన్నారు.

ఈ ప్రాజెక్ట్, ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంతంలో పారిశ్రామిక అభివృద్ధిని మరింత వేగవంతం చేస్తుందని, మరియు మొబిలిటీ, ఎలక్ట్రానిక్స్, పునరుత్పాదక ఇంధనం, అధునాతన తయారీ వంటి రంగాలలో భారీ స్థాయి తయారీ పెట్టుబడులకు ప్రాధాన్య గమ్యస్థానంగా రాష్ట్రం యొక్క పెరుగుతున్న ఖ్యాతిని మరింత బలోపేతం చేస్తుందని భావిస్తున్నారు.

# కిడ్నీ రోగులకు 'కూటమి' భరోసా



(మొదటి పేజీ తరువాయి)

**కిడ్నీ రోగులకు సాంత్వన చేకూర్చేలా :** గత వైకాపా (2019-2024) పాలనలో 19 కేంద్రాలు ఏర్పాటయ్యాయి. కూటమి ప్రభుత్వంలో ఇప్పటివరకు 12 కేంద్రాలు కొత్తగా ఏర్పడ్డాయి. వీటికి అదనంగా ఈ 12 కేంద్రాలు రాబోతున్నాయని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ నేడొక ప్రకటనలో వెల్లడించారు. 23 నెలల్లో 24 కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని, కూటమి ప్రభుత్వం రోగుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తోందని ఆయన తెలిపారు.

**12 కేంద్రాలు ఎక్కడెక్కడ :** పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం, చిత్తూరు జిల్లా పీలేరు, వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు ఏరియా ఆసుపత్రుల్లో ఈ కేంద్రాలు ఏర్పాటుకాబోతున్నాయి. అలాగే..నెల్లూరు జిల్లా వెంకటగిరి, ప్రకాశం జిల్లా అద్దంకి, నంద్యాల జిల్లా సున్నిపెంట, తిరుపతి జిల్లా రైల్వే కోడూరు, ప్రకాశం జిల్లా కొండేపి, తూర్పుగోదావరి జిల్లా కోవూరు, కడప జిల్లా మైదుకూరు, ఎన్టీఆర్ జిల్లా నందిగామ, పల్నాడు జిల్లా వినుకొండ సామాజిక ఆసుపత్రుల్లో ఈ కేంద్రాలు వస్తున్నాయి. ఒక్కో కేంద్రంలో రక్త శుద్ధి నిర్వహణ కోసం 5 చొప్పున మెషిన్లు సమకూరుస్తారు. ఒక్కొక్క కేంద్రంలో సుమారు రూ. 85 లక్షలు విలువచేసే రక్త శుద్ధి యంత్రాలు/పరికరాలను సమకూరుస్తారు. వీటివల్ల 1,500 మంది రోగులకు ప్రయోజనం చేకూరుతుంది. ఇవికాకుండా.. ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ కింద 186 అనుబంధ ఆసుపత్రుల్లోని కేంద్రాల్లో కిడ్నీ బాధితులు ఉచితంగా డయాలసిస్ సేవలు పొందుతున్నారు. పీఎంఎన్డీపీ, ఎన్టీఆర్ వైద్యా సేవా ట్రస్ట్ కింద కలిపి కిడ్నీ రోగుల కోసం ప్రతి ఏటా సుమారు రూ. 165 కోట్ల వరకు కూటమి ప్రభుత్వం ఖర్చుపెడుతోంది. దీర్ఘకాలంపాటు డయాలసిస్ అవసరమైన వారి ప్రాణాలు ఈ కేంద్రాల ద్వారా నిలబడుతున్నాయి.

# పేదవాడి సొంతింటి కల సాకారం

(మొదటి పేజీ తరువాయి)

11 లక్షల మందికి పైగా కుటుంబాలను పీ4 కింద అడాప్ట్ చేసుకున్నాం. విద్యతో పాటు ఆర్థిక చేయూత, ఉపాధి ఉద్యోగం లాంటి అంశాలతో పాటు జీవన ప్రమాణాలు మెరుగుపడాలి. 10-20 ఫార్ములాతో పీ4 కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తున్నాం. మన రాష్ట్రానికి సౌర విద్యుత్ ఓ గేమ్ చేంజర్, ఎస్సీ,ఎస్టీలు, బీసీలకు రాయితీపై సోలార్ రూఫ్ టాప్ ఇస్తున్నాం. ప్రజలకు విద్య కోసం పెడుతున్న ఖర్చు తగ్గించాలి. విద్యా శాఖ ఇటీవల కాలంలో చక్కగా పని చేస్తోంది... ప్రభుత్వ స్కూళ్లల్లో అడ్మిషన్లు పెరిగాయి. ప్రజలు వైద్యంపై పెట్టే ఖర్చును కూడా గణనీయంగా తగ్గించాలి. మెరుగైన వైద్యం అందించాలి. విద్యుత్ ఛార్జీలు తగ్గేలా చేస్తే పేదవారికి మెరుగ్గా ప్రయోజనాలు అందుతాయి. సంక్షేమం, సాధికారిత అనేది నిరంతర కార్యక్రమంగా కొనసాగాలి. జల్ జీవన్ మిషన్ ద్వారా సురక్షితమైన తాగునీరు, వ్యర్థాల నిర్వహణ, గ్యాస్, వీధి దీపాలు, సిమెంట్ రోడ్లుతో క్లీన్ విలేజ్ గా తీర్చిదిద్దాలి. ప్రజల జీవనప్రమాణాలు పెంచేలా చర్యలు చేపడుతున్నాం. కుటుంబ అవసరాలు, సామాజిక అవసరాలు తీరితే సుస్థిరాభివృద్ధి దిశగా ముందుకు వెళ్దాం."అని సీఎం వివరించారు.




**ప్రభుత్వ లక్ష్యం... ప్రజల సంక్షేమం :** "నిర్దుష్టమైన తేదీల్లో దీపం-2.0 కింద ఇచ్చే సబ్సిడీ డబ్బులు లబ్దిదారులకు ఇచ్చేలా చూడాలి. దీపం-2.0 పథకానికి ఇప్పటి వరకు రూ. 3,504 కోట్లు మేర ఖర్చు అయ్యింది. దీపం-2.0 పథకం కింద 1.08 కోట్ల మంది లబ్దిదారులు ఉన్నారు. స్త్రీశక్తి కింద ఇప్పటి వరకు 60.6 కోట్ల ప్రయాణాలు చేశారు. ఏడాదికి రూ. 1940 కోట్లను స్త్రీ శక్తికి ఖర్చు పెడుతున్నాం. తల్లికి వందనం ద్వారా 67 లక్షల మందికి రూ. 10 వేల కోట్లు ఇస్తున్నాం. మే 19వ తేదీన మత్స్యకారుల సేవలో కార్యక్రమం రూ. 286 కోట్ల మేర లబ్దిదారులకు పంపిణీ చేస్తున్నాం. హాస్టళ్లల్లో ఏదీ వృధా కాకుండా చూడాలి. నెట్ జీరో విధానాన్ని హాస్టళ్లకు వర్తింప చేయాలి. హాస్టళ్ల కిచెన్ల నుంచి వ్యర్థాలను సర్క్యులర్ ఎకానమీకి అనుసంధానం చేయాలి.. నెట్ జీరో హెల్తీ క్యాంపస్ లు ఏర్పాటు చేయాలి. కిచెన్, ఫ్రూట్ గార్డెన్లు వచ్చేలా చూడాలి. గిరిజన, ఎస్సీ సంక్షేమ శాఖలో చదువుతున్న విద్యార్థులు ఐఐటీ ర్యాంకులు సాధించేలా శిక్షణ ఇవ్వాలి. పావలా వడ్డీకే జాతీయ, అంతర్జాతీయ సంస్థల్లో చదువుకునేలా విద్యారుణం ఇప్పించేలా కార్యాచరణ చేపట్టాలి. విదేశాల్లో ఉద్యోగాలు దక్కించుకునేలా ఎస్సీ,ఎస్టీ యువతకు జర్మన్ భాష నేర్పిస్తున్నాం. గిరిజన ప్రాంతాల్లో కాఫీ, పసుపు, కుంకుమపువ్వు సాగును చేపడుతున్నాం... వ్యాల్యూ అడిషన్ వచ్చేలా ప్రాసెసింగ్ ప్రక్రియ చేపట్టాలి. నేచురల్ ఫార్మింగ్, ట్రేసబిలిటీ, సర్టిఫికేషన్ లాంటి ప్రక్రియలు కూడా చేపట్టాలి. అరకు కాఫీ గ్లోబల్ బ్రాండ్ గా మారేందుకు ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలి... వీటికి పర్యాటక ప్రాజెక్టులను లింక్ చేయాలి."అని ముఖ్యమంత్రి చెప్పారు.

# ప్రజల చెంతకు 'ఫీల్డ్ గ్రీవెన్స్ డే'!



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** అర్జీలు, ఫిర్యాదులు పరిష్కారంలో ఎలాంటి అలక్ష్యం చూపొద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. కొందరు కలెక్టర్లు అర్జీలు తీసుకుని కారులోనే పడేస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని.. అలా జరగ్గకూడదని సీఎం స్పష్టం చేశారు. శుక్రవారం 7వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్ రెండో రోజున వివిధ అంశాలపై సమీక్షించారు. ఫైళ్ల క్లియరెన్స్.. ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, డేటా లేక్, అవేర్, వాట్సాప్ గవర్నెన్స్ వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."ఇ-ఫైళ్ల క్లియరెన్స్ రోజుల వ్యవధి నుంచి గంటల వ్యవధిలోకి రావడం మంచి పరిణామం. ఇ-ఫైళ్ల క్లియరెన్స్‌లో వేగంగా ఉన్న మంత్రులు, కలెక్టర్లు, ఎస్పీలు, సెక్రటరీలకు సీఎం అభినందనలు. పెద్దమొత్తంలో ఫైళ్లు వచ్చినా సరాసరి 10 గంటల వ్యవధిలో ఫైళ్లను డిస్పోజ్ చేసిన సీఎస్ సాయి ప్రసాద్‌ను అభినందిస్తున్నా. ఫైళ్ల క్లియరెన్స్‌లో వెనుకబడిన పలువురు కలెక్టర్లు, ఎస్పీలు, జాయింట్ కలెక్టర్లు వేగం పెంచాలి. గత మూడు నెలలతో పోల్చుకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఫైళ్ల క్లియరెన్స్ సమయం 10 రోజుల నుంచి రెండు రోజులకు తగ్గింది. ఫైళ్లను త్వరగా క్లియర్ చేస్తే ప్రభుత్వ సేవలు మరింత త్వరగా అందుతాయి. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్సులో ఫైళ్ల క్లియరెన్స్ అతి ముఖ్యమైన అంశం. సీఎస్, సెక్రటరీలు, హెచ్వోడీలు మొదలుకుని.. మండల స్థాయి వరకు ఫైళ్ల క్లియరెన్సులో వేగం పెరగాలి. మ్యానువల్ ఫైళ్లనేవి దాదాపు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పాలనకు టెక్నాలజీ అనుసంధానించడంతోపాటు... హ్యూమన్ టచ్ కూడా ముఖ్యం. మానవీయ కోణంలో ఆలోచించి పరిపాలన చేపట్టాల్సిన అవసరం ఉంది. 24 గంటల్లోపు ఇ-ఫైల్స్ డిస్పోజ్ చేసేలా మంత్రులు, అధికారులు శ్రద్ధ పెట్టాలి. ఫైళ్ల క్లియరెన్స్ విషయంలో అందరి పని తీరును ఎప్పటికప్పుడు నమోదు చేస్తూనే ఉన్నాం. జిల్లాల్లో ఇ-ఆఫీస్ ద్వారా లేని ఫైల్స్ ఎన్ని ఉన్నాయో గుర్తించండి. జిల్లా స్థాయిలో, హెచ్ఓడీలు తప్పనిసరిగా ఇ-ఫైల్స్ మాత్రమే జనరేట్ చేయాలి. ప్రజలకు సేవలందించే విషయంలో వినూత్న ఆలోచనలతో పాటు... మరింత మెరుగైన పాలనకూ కలెక్టర్లు వినూత్నంగా ఆలోచించాలి."అని సూచించిన సీఎం చంద్రబాబు.

**పీజీఆర్ఎస్ కోసం ప్రజా దర్బార్లు :** "పీజీఆర్ఎస్ కోసం ప్రజాదర్బార్ లాంటి ఓ వేదికను ఏర్పాటు చేయబోతున్నాం. ఫిర్యాదులు స్వీకరించే సమయంలోనే ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పరిష్కరించే ప్రయత్నం చేద్దాం. సింగపూర్ లో ఇదే రకంగా ఫిర్యాదుల పరిష్కారం జరుగుతోంది. మండల స్థాయిలోనూ పీజీఆర్ఎస్ విధానంలో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించటం ద్వారా ప్రజలకు ఉపయోగపడుతుంది. ప్రతి సోమవారం కలెక్టరేట్లో గ్రీవియన్స్ స్వీకరిస్తున్నట్టే... ఇకపై ప్రతి శుక్రవారం నియోజకవర్గాల్లో గ్రీవియన్స్ స్వీకరించాలి. ప్రతీ శుక్రవారం ఫీల్డ్ గ్రీవెన్స్ డేగా నిర్ణయిచాం. సమస్యలు పరిష్కారమైతే బ్రాండ్ రావటంతో పాటు ప్రజల్లో విశ్వాసం పెరగటం ముఖ్యం. కాగితాలు తీసుకుని కార్లో వదిలిపెట్టొద్దు... పిటిషన్లకు పరిష్కారం చూపాలి. ప్రతీ నెలా ఒక నియోజకవర్గాన్ని నాలుగు సార్లు సందర్శించాలి. సమస్యల పరిష్కారానికి గుడ్ విల్ మిషన్ గా కలెక్టర్లు క్షేత్రస్థాయికి వెళ్లాలి. అన్ని వీడియో కాన్ఫరెన్సులను కూడా ఒకరోజుకు పరిమితం చేద్దాం."అని ముఖ్యమంత్రి అన్నారు.

**ఆన్ లైన్ సేవలతో అవినీతికి చెక్ :** "ప్రభుత్వ నిబంధనలు, ప్రొసీజర్స్ సులభతరం కావాలి. కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఉంటే ఎంత టైమ్ వృధా అవుతుందో ఆలోచించండి. ప్రజలకు త్వరితగతిన సేవలు అందిస్తూ.. ఆన్ లైన్ సేవలను పూర్తిగా అందుబాటులోకి తెస్తే ప్రజల సమయం వృధా కాదు. టెక్నాలజీ ఇంటిగ్రేషన్ జరిగితే... పాలన సులభతరం అవుతుంది. వాట్సప్ గవర్నెన్సు మనమిత్ర ద్వారా పౌరసేవలపై ప్రజలకు శిక్షణ ఇస్తున్నాం. ఇప్పటికే 29 లక్షల మందికి ట్రైనింగ్ ఇచ్చాం... 90 శాతం ప్రభుత్వ సేవలు వాట్సప్ లో అందుబాటులో ఉన్నాయి. డిసెంబరు నాటికి అన్ని సేవల్ని వాట్సప్ లో అందించేలా చూడాలి. మాన్యువల్ టచ్ పాయింట్ల వద్దకు వచ్చే ప్రజలకు వాట్సప్ వినియోగాన్ని వివరించాలి. స్మార్ట్ ఫోన్లు లేని కుటుంబాలు 34 శాతంగా ఉన్నాయి. ఆన్ లైన్ సేవల ద్వారా అవినీతితో పాటు దుర్వినియోగం కూడా తగ్గుతుంది. అవేర్ 2.0 నుంచి వచ్చే సమాచారాన్ని ఇంటిగ్రేట్ చేసుకుంటూ నిర్ణయాలు తీసుకోవాలి. పిడుగుల హెచ్చరికలను జారీ చేయటంలో ఇంకా పర్ఫెక్షన్ రావాలి. తుపాన్ల హెచ్చరికల సమయంలో నేరుగా మొబైళ్లకే మెసేజిలు పంపించాలి. తుపాన్ల హెచ్చరికలను స్వర్ణ గ్రామ,వార్డుల ద్వారా కూడా పంపించాలి. సీవీడ్ సాగుపై తీరప్రాంత జిల్లాల కలెక్టర్లు దృష్టి పెట్టాలి. అర్బన్ డెవలప్మెంట్ అథారిటీల్లో అక్రమ కట్టడాలపై దృష్టి పెట్టాలి. మున్సిపాలిటీలు, సెమీ అర్బన్ ప్రాంతాల్లో ఎలాంటి అక్రమ నిర్మ?ణాలూ లేకుండా చూడాలి."అని సీఎం ఆదేశించారు. ఇక అవేర్, డేటా లేక్ అంశాలపై జరిగిన సమీక్షలో భాగంగా సీఎం కొన్ని కీలక సూచనలు చేశారు. పరిపాలనలో భాగంగా వేర్వేరు వెబ్ సైట్లు, డ్యాష్ బోర్డులు కాకుండా ఒకే ప్లాట్ ఫాంపై ఉండేలా చూడాలని ఐటీ శాఖకు సీఎం సూచించారు. అన్ని శాఖలకు సంబంధించిన కేపీఐలతో ఓ డ్యాష్ బోర్డు తయారు చేస్తామని ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ తెలిపారు. రోజువారీ లక్ష్యాలను ఈ డ్యాష్ బోర్డు నుంచి గుర్తించి దానికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకునే వెసులుబాటు ఉంటుందని మంత్రి లోకేష్ చెప్పారు. 90 రోజుల్లో ఈ డ్యాష్ బోర్డును అందుబాటులోకి తెస్తామని ఐటీ మంత్రి వెల్లడించారు. ఈ సమావేశంలో మంత్రులు, సీఎస్ సాయి ప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు.

# ఇక ఆంధ్రప్రదేశ్లో బీజేపీ విస్తరణే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

మూడు రాష్ట్రాల్లో బీజేపీ సాధించిన విజయాలను పురస్కరించుకుని నాయకులు స్వీట్లు పంచుకుని సంబరాలు నిర్వహించారు.






ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి వేగంగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాలపై అందరూ దృష్టి కేంద్రీకరించాలని పిలుపునిచ్చారు. పశ్చిమ బెంగాల్ లో బీజేపీ విజయం దేశ రాజకీయాల్లో చారిత్రాత్మక మలుపని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పాలనలో అరాచకాలు పెరిగాయని విమర్శించారు. పశ్చిమ బెంగాల్ విజయం దేశానికే తలమానికమని పేర్కొన్నారు.

అలాగే పుదుచ్చేరి, అస్సాం రాష్ట్రాల్లో విజయాన్ని ప్రస్తావిస్తూ, కేరళంలో మూడు స్థానాలు సాధించడం పార్టీ బలపడుతున్న సంకేతమన్నారు. త్వరలో అక్కడ కూడా బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తమిళనాడులో నటుడు విజయ్ విజయాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీ ప్రభావం క్రమంగా పెరుగుతోందన్నారు. త్వరలో తెలంగాణలో ప్రధాని నరేంద్ర మోదీ సభ జరగనుందని, అనేక కీలక అంశాలపై ఆయన ప్రసంగించనున్నారని తెలిపారు. ముస్లింలు సహా అన్ని వర్గాల ప్రజలు బీజేపీకి వంద్దతాం ఇన్తున్నారని, నవాజంలోని ప్రతి వర్గాన్ని కలుపుకుని వెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

అమరావతికు శాశ్వత హోదా కల్పించడం ద్వారా రాష్ట్రానికి దీర్ఘకాలిక సమస్య పరిష్కారమైందన్నారు. గతంలో రాజధాని అంశంపై నెలకొన్న అనిశ్చితి అభివృద్ధికి అడ్డంకిగా మారిందని చెప్పారు. అలాగే విశాఖపట్ణం రైల్వే జోన్ ఏర్పాటు చిన్న విషయం కాదని, జూన్ 1 నుంచి విశాఖ పూర్తి స్థాయి రైల్వే జోన్‌గా మారబోతుందని వెల్లడించారు. ఈ విషయంలో బీజేపీ కీలక పాత్ర పోషించిందన్నారు. విభజన చట్టంలోని అనేక అంశాలను కేంద్రం అమలు చేసిందని, దేశంలో ఏ రాష్ట్రానికి లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌కు రూ. 15 లక్షల కోట్లకు పైగా కేంద్ర సహకారం అందిందని పేర్కొన్నారు. ప్రజలపై అదనపు భారం మోపకుండా కేంద్ర ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు.

ప్రతి నెలా రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని సమావేశంలో తీర్మానించారు. అలాగే శక్తి కేంద్రాలు, మండలాలు, జిల్లా కమిటీల సమావేశాలను నెలనెలా నిర్వహించాలని నిర్ణయించారు.

సమావేశంలో బీజేపీ ఎమ్మెల్యే పక్ష నేత పెనమత్స విష్ణుకుమార్ రాజు , ఎమ్మెల్యేలు డా. పార్థసారథి, ఎన్. ఈశ్వరరావు, ఆదినారాయణ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాపు రమచంద్రా రెడ్డి, గుంటూరు జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ పాతూరి చైర్మన్, రాష్ట్ర కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఈ-ఫైళ్ల క్లియరెన్స్‌లో మంత్రి అచ్చెన్నాయుడు సరికొత్త రికార్డు



(మొదటి పేజీ తరువాయి)

ఈ-ఫైళ్ల క్లియరెన్స్‌ను రోజుల వ్యవధి నుంచి గంటల వ్యవధిలోకి తీసుకురావడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంతృప్తి వ్యక్తం చేశారు. పరిపాలనలో వేగం, పారదర్శకత, ప్రజా ప్రయోజనాల పట్ల కట్టుబాటుతో ముందుకు సాగుతున్న మంత్రి అచ్చెన్నాయుడి పనితీరును సీఎం ప్రత్యేకంగా అభినందించారు. మంత్రి అచ్చెన్నాయుడు నాయకత్వంలో వ్యవసాయ, అనుబంధ శాఖల పరిపాలన మరింత సమర్థవంతంగా మారుతోందని, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలనే ప్రభుత్వ సంకల్పాన్ని ఆయన కార్యాచరణ స్పష్టంగా ప్రతిబింబిస్తోందని అధికారులు పేర్కొన్నారు.

# విజయ్ సర్కార్ ఖరారు

(మొదటి పేజీ తరువాయి)

మరోవైపు కొత్త ప్రభుత్వం ప్రమాణస్వీకారానికి ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. శనివారం ఉదయం 11 గంటలకు చెన్నైలోని నెహ్రూ స్టేడియంలో ముఖ్యమంత్రిగా విజయ్ ప్రమాణస్వీకారం చేయనున్నారు.

మే 4న ఫలితాలు వెలువడిన అనంతరం గవర్నర్‌ను విజయ్ కలవడం ఇది మూడోసారి. విజయ్ రెండు చోట్ల గెలవడంతో టీవీకేకు 107 మంది ఎమ్మెల్యేల సంఖ్యా బలం ఉంది. అయితే ప్రభుత్వ ఏర్పాటుకు 118 మంది ఎమ్మెల్యేల బలం అవసరమైంది. ఐదుగురు ఎమ్మెల్యేలున్న కాంగ్రెస్ టీవీకేకు మద్దతు ఇవ్వడంతో ఆ బలం 112కు చేరింది. ఈ క్రమంలో ఇద్దరేసి ఎమ్మెల్యేలున్న వీసీకే, సీపీఐ, సీపీఎం సైతం బేషరుతుగా టీవీకేకు మద్దతివ్వాలని నిర్ణయం తీసుకున్నాయి. దీంతో మెజారిటీ అవసరమైన 118 మంది సభ్యుల బలం టీవీకే సంపాదించగలిగింది. దీనికితోడు ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్న ఐయూఎంఎల్ కూడా టీవీకేకు మద్దతు ప్రకటించింది. దీంతో టీవీకేకు మద్దతిస్తున్న ఎమ్మెల్యేల బలం 120కి చేరుకుంది.

# రాజధానిలో గ్లోబల్ వైబ్స్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో పర్యాటక, పారిశ్రామిక రంగాలు సరికొత్త పుంతలు తొక్కుతున్నాయి. కృష్ణా తీరానికి సమీపంలో రాజధాని నడిబొడ్డున ప్రతిష్టాత్మక 'కోర్టుయార్డ్ బై మారియట్' హోటల్ ప్రాజెక్టుకు శుక్రవారం ఘనంగా భూమి పూజ నిర్వహించారు. సదరన్ గ్లోబ్ హోటల్స్ ు రిసార్ట్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో పర్యాటక మంత్రి కందుల దుర్గేష్, పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ లు ముఖ్య అతిథులుగా పాల్గొని శాస్త్రోక్తంగా భూమి పూజ నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ "ప్రజా రాజధాని అమరావతిలో అంతర్జాతీయ బ్రాండ్ అయిన 'మారియట్' హోటల్ శంకుస్థాపన జరగడం శుభపరిణామం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్ ప్రకారం అమరావతిని గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దుతున్న క్రమంలో ఇటువంటి భారీ ప్రాజెక్టులు పర్యాటక రంగానికి వెన్నెముకగా నిలుస్తాయి. మారియట్ గ్రూప్ ప్రమాణాలకు అనుగుణంగా 175 రూమ్స్, విశాలమైన స్విమ్మింగ్ పూల్, బ్యాంకెట్ హాల్, బిజినెస్ లాంజ్, మల్టీ కుజీన్ రెస్టారెంట్ తదితర సకల హంగులతో రాజధానికి వచ్చే అంతర్జాతీయ పర్యాటకులకు, వ్యాపారవేత్తలకు ఇది అత్యున్నత స్థాయి వసతిని కల్పిస్తుంది" అని పేర్కొన్నారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం లింగాయపాలెంలోని ఏపీ సీఆర్డీయే కార్యాలయం ఎదురుగా నిర్మితమవుతున్న ఈ హోటల్ 2028 డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని హోటల్ ప్రతినిధులు వెల్లడించారు. అమరావతి లాంటి అభివృద్ధి చెందుతున్న ప్రాంతంలో తాము ఈ హోటల్ నిర్మిస్తుండటం సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. సదరన్ ట్రావెల్స్, గ్లోబ్ సివిల్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్, డెల్టా ప్యూర్ కంపెనీలు ఈ ప్రాజెక్టులో కీలక భాగస్వాములుగా వ్యవహరిస్తున్నాయి. రాజధాని ప్రాంతంలో అంతర్జాతీయ స్థాయి ఆతిథ్య రంగానికి ఈ ప్రాజెక్ట్ ఒక చిరునామాగా మారుతుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



భారత దేశ రాజకీయాలలో సూపర్ స్టార్, తెలుగు జాతి గర్వించదగ్గ ఆణిముత్యం చంద్రబాబు. భారత దేశంలో ఆయనకు ఉన్న క్రేజ ఏ నాయకులకు లేదు. చంద్రబాబు ఒక వ్యక్తి కాదు సామూహిక శక్తి. ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు సమపాళ్లలో అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నారు.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



శనివారం 09.05.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 17 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# పేదవాడి సొంతింటి కల సాకారం


## ప్రజల చెంతకు 'ఫీల్డ్ గ్రీవెన్స్ డే'!

- అర్జీల పరిష్కారంలో బ్రాండ్ తెచ్చుకోవాలి
- ఇకపై ప్రజా ప్రతినిధులు... అధికారులు ఉమ్మడిగా పీజీఆర్ఎస్
- ప్రతీ శుక్రవారం ఫీల్డ్ గ్రీవెన్స్ డే
- సత్వర ఫైళ్ల క్లియరెన్సుతో సత్వర సేవలు
- ప్రజల సమయాన్ని వృధా చేయొద్దు
- టెక్నాలజీని వినియోగించండి... మానవీయ కోణంతో వ్యవహరించండి
- 7వ రోజు జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు

## ఇరిగేషన్ క్యాలెండర్‌తో చంద్రబాబు కొత్త దిశ!

- ఇరిగేషన్ క్యాలెండర్ ప్రకటించిన సీఎం చంద్రబాబు
- 25 సాగునీటి ప్రాజెక్టులకు గడువులు వెల్లడి

- ఇళ్లు కట్టాలి... ఇళ్ల స్థలాలు ఇవ్వాలి... క్రమబద్ధీకరించాలి
- ప్రజలకు విద్య, వైద్యం, విద్యుత్ భారాలు తగ్గాలి
- జాతీయ, అంతర్జాతీయ విద్యకు పావల వడ్డీ రుణాలు
- ఎస్సీలకు కలిగే ప్రయోజనాలన్నీ బుడగజంగాలకు కల్పించండి
- రూరల్ ఆటోనగర్‌ల ఏర్పాటుపై దృష్టి సారించండి
- అరకు కాఫీకి గ్లోబల్ బ్రాండ్ రావాలి
- పేదల సంక్షేమం కోసమే సమీక్షలు... సమావేశాలు
- 7వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** సంతృప్త స్థాయిలో అందరికీ ఇళ్లు ఇవ్వాలని... అవసరమైన వారికి ఇళ్ల స్థలాలు, ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి క్రమబద్ధీకరించడం వంటి అంశాలపై ప్రభుత్వ యంత్రాంగం ఫోకస్ పెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. 2027 చివరి నాటికి రీ-సర్వే పూర్తి చేయడంతోపాటు... 22ఏ భూముల సమస్యలను పరిష్కరించాలని స్పష్టం చేశారు. 7వ జిల్లా కలెక్టర్ల సమావేశంలో భాగంగా రెండో రోజున సీఎం చంద్రబాబు సంక్షేమ శాఖలు, రెవెన్యూ, హౌసింగ్, సమ్మర్ యాక్షన్ ప్లాన్ వంటి అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."ఆగస్టు 15లోగా 2.50 లక్షల ఇళ్లకు సామూహిక గృహ ప్రవేశాలు జరగాలి. డిసెంబర్ నాటికల్లా మరో 2.38 లక్షల ఇళ్లకు గృహ ప్రవేశాలు జరిగేలా చర్యలు తీసుకోవాలి. 2027 డిసెంబర్ నాటికి మరో 10 లక్షల ఇళ్ల నిర్మాణం లక్ష్యం. 2 లక్షల మందికి ఇంటి జాగాలు అవసరం అవుతాయని అంచనా. 3 సెంట్లు గ్రామాల్లో, 2 సెంట్లు అర్బన్ ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు ఇవ్వాల్సి ఉంది. లబ్దిదారులు అంగీకరిస్తే... ప్రస్తుతం ఉన్న వారికి అదే లే అవుట్లల్లో ఇళ్ల స్థలాలు ఇవ్వండి. ఇబ్బందులు లేని చోట భూసేకరణ, సమీకరణతో ఇళ్ల స్థలాలు ఇవ్వండి. ప్రభుత్వ భూములు, కొండ ప్రాంతాల్లో నిర్మించుకున్న ఇళ్లను క్రమబద్ధీకరించాలి. ఇళ్ల క్రమబద్ధీకరణలో ఏమైనా ఇబ్బందులు వస్తే కెబినెట్ కు పంపాలి... మేం ఆమోదిస్తాం. ఇళ్ల క్రమబద్ధీకరణ పూర్తి చేయగలిగితే... విజయవాడలో 60 వేల మందికి, విశాఖలో 30 వేల మందికి లబ్ది చేకూరుతుంది. గుంటూరులో 22ఏ భూముల సమస్యలను పరిష్కరించాలి. వచ్చే కలెక్టర్ల సమావేశంలోగా 22ఏ పెండింగ్ ఉండకూడదు. భూవివాదాల్లో అతిపెద్ద లిటిగెంట్ రెవెన్యూ విభాగమే. 4 లక్షలకు పైగా భూవివాదాల కేసులు పెండింగులో ఉన్నాయి. ఖాళీగా ఉన్న డీఆర్వోలు, ఆర్డీవోల స్థానాలకు త్వరలో పోస్టింగ్స్ ఇస్తాం. జిల్లా కార్యాలయాల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపడదాం. రీసర్వే ప్రక్రియను 2027 మార్చిలోగా పూర్తి చేయాలి... పట్టాదారు పాస్ పుస్తకాలు కూడా జారీ కావాలి."అని సీఎం ఆదేశించారు.

**కమిషన్ నివేదిక ఆధారంగా స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు :** "బుడగ జంగాలను ఎస్సీల్లో చేర్చాలనే డిమాండ్ ఉంది... దీనిపై కేంద్రంతో మాట్లాడతాం. కేంద్రం నుంచి అనుమతులు వచ్చేలోపు ఉద్యోగాలు మినహా ఎస్సీలకు వర్తింప చేసే ప్రతి ప్రయోజనాన్ని బుడగజంగాలకు వర్తింప చేయాలి. రాష్ట్రంలో బీసీ కులాల వెనుకబాటుతనంపై అధ్యయనం చేయడానికి ఓ ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేశాం. కమిషన్ ఇచ్చే నివేదిక ఆధారంగా స్థానిక సంస్థల్లో తగిన రిజర్వేషన్లు కల్పించేందుకు చర్యలు చేపడతాం. బీసీ హాస్టళ్లల్లో ఆర్వో యూనిట్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం... హాస్టళ్లకు మరమ్మత్తులు చేపట్టాం. ముస్లిం జనాభా ఉన్న చోట 175 నియోజకవర్గాల్లోనూ రూరల్ ఆటోనగర్ లు ఏర్పాటు చేస్తే ఓ పారిశ్రామిక వాడ సిద్ధం అవుతుంది. వక్ఫ్ బోర్డు స్థలాల్లో ఈ పారిశ్రామికవాడలను మైనారిటీల కోసమే ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలి... జీవనోపాధి హబ్‌లుగా వీటిని అభివృద్ధి చేయాలి. జలధార, పశుగ్రాసం సహా వివిధ కార్యక్రమాలను కేంద్ర పథకాలతో ఇంటిగ్రేట్ చేసి అమలు చేయాలి. ప్రజలపై ఆర్థిక భారం తగ్గించేలా అధికారులు కృషి చేయాలి. విద్య, వైద్యం, విద్యుత్ ఖర్చుల నుంచి ప్రజలకు ఊరట కలిగించేలా అధికారులు చొరవ చూపాలి. ప్రభుత్వ పథకాలు.. ప్రభుత్వ చేపట్టే కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ప్రజలకు లబ్ది కలుగుతుందనే అవగాహన పెంచాలి. కలెక్టర్ల సమావేశాలు... సమీక్షలు... గంటల తరబడి మీటింగులు అన్నీ ప్రజల కోసమేననే అంశాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి. పేద, మధ్య తరగతి, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుంది. విద్య, వైద్యం, సామాజిక అభివృద్ధి విషయాల్లో ప్రత్యేక దృష్టి పెట్టాం. ఎన్ఐటీ, ఐఐఎం, ఐఐటీ లాంటి ప్రఖ్యాత సంస్థల్లో బడుగులకు, పేదలకు సీట్లు దక్కించుకునేలా పని చేయాలి. ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాలకు అందరికీ సమన్యాయం జరగాలి. అన్ని వర్గాల యువతకూ నైపుణ్యాభివృద్ధి జరగాలి. మిగతా 2లో...

## విజయ్ సర్కార్ ఖరారు




- విజయ్‌కు గవర్నర్ అనుమతి..
- ప్రమాణస్వీకారానికి ముహూర్తం ఫిక్స్

**చెన్నై (జర్నలిస్ట్ ఫైల్) :** తమిళనాడులో ఏకైక పెద్ద పార్టీగా నిలిచిన విజయ్ సారథ్యంలోని టీవీకే ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగగమైంది. మెజారిటీకి అవసరమైన సంఖ్యాబలంతో గవర్నర్ ఆర్వీ అర్లేకర్‌ను విజయ్ రాజ్‌భవన్‌లో శుక్రవారం సాయంత్రం కలిశారు. ఎమ్మెల్యేల మద్దతు లేఖను ఆయనకు అందజేశారు. ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించాల్సిందిగా కోరారు. దీంతో సంతృప్తి చెందిన గవర్నర్ కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు అనుమతించారు. మిగతా 2లో...

## రాయలసీమకు 'రాయల్' కళ!

- తిరుపతిలోని సత్యవేడులో భారీ తయారీ, విక్రయ కేంద్రాన్ని నిర్మించనున్న రాయల్ ఎన్‌ఫీల్డ్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక, తయారీ రంగ ఆశయాలకు ఒక పెద్ద ఊతమిస్తూ, ప్రఖ్యాత మోటార్‌సైకిల్ తయారీ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్ తన కొత్త తయారీ విస్తరణ ప్రాజెక్ట్ కోసం ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకుంది. 1901లో స్థాపించబడినప్పటి నుండి తమిళనాడు వెలుపల కంపెనీ చేపడుతున్న మొట్టమొదటి భారీ విస్తరణ ఇది.

ఆంధ్రప్రదేశ్-తమిళనాడు సరిహద్దుకు సమీపంలో, తిరుపతి జిల్లాలోని సత్యవేడులో అత్యాధునిక తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి కంపెనీ రెండు దశల్లో సుమారు రూ.2,200 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా రాయల్ ఎన్‌ఫీల్డ్ తయారీ సామర్థ్యానికి దాదాపు 9 లక్షల యూనిట్లు అదనంగా చేరతాయని, అలాగే ప్రపంచ ప్రీమియం మోటార్‌సైకిల్ తయారీ కేంద్రంగా భారతదేశ స్థానం మరింత బలోపేతం అవుతుందని అంచనా. మిగతా 2లో...

## ఈ-ఫైళ్ల క్లియరెన్స్‌లో మంత్రి అచ్చెన్నాయుడు సరికొత్త రికార్డు

- గంటల్లో ఫైళ్ల పరిష్కారం..
- మంత్రి అచ్చెన్న పనితీరుకు సీఎం చంద్రబాబు ప్రశంసలు
- పారదర్శకత, వేగం, సమర్థత.. మంత్రి అచ్చెన్నాయుడు ప్రత్యేకత



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఈ-ఫైళ్ల క్లియరెన్స్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అసాధారణ వేగం ప్రదర్శిస్తూ పరిపాలనలో కొత్త ప్రమాణాలను నెలకొల్పుతున్నారు. ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలనే లక్ష్యంతో ఆయన తీసుకుంటున్న చర్యలు ప్రభుత్వ యంత్రాంగంలో చురుకుదనాన్ని పెంచుతున్నాయి. గతంలో ఈ-ఫైళ్ల క్లియరెన్స్‌కు సుమారు 5 గంటల సమయం తీసుకున్న మంత్రి అచ్చెన్నాయుడు, ప్రస్తుతం భారీ స్థాయిలో ఫైళ్లు వచ్చినప్పటికీ సరాసరి కేవలం 2 గంటల 49 నిమిషాల వ్యవధిలోనే ఫైళ్లను డిస్పోజ్ చేస్తుండటం పరిపాలనా సామర్థ్యానికి నిదర్శనమని అధికారులు వెల్లడించారు. -2లో.

## బెంగాల్ పగ్గాలు సువేందుకే



- సోనార్ బంగ్లా కలల సాకారం..
- సువేందును శాసనసభాపక్ష నేతగా ప్రకటించిన అమిత్‌షా

**కోల్‌కతా (జర్నలిస్ట్ ఫైల్) :** పశ్చిమబెంగాల్ బీజేపీ శాసనసభాపక్ష నేతగా సువేందు అధికారిని కేంద్రం హోం మంత్రి అమిత్‌షా శుక్రవారంనాడు ప్రకటించారు. 'కాబోయే సీఎం'గా సువేందును అభివర్ణించారు. - 2లో...


## ఇక ఆంధ్రప్రదేశ్లో బీజేపీ విస్తరణే లక్ష్యం




- మూడు రాష్ట్రాల్లో బీజేపీ విజయాలతో రాష్ట్ర కేడరులో ఉత్సాహం

**విజయవడ(జర్నలిస్ట్ ఫైల్) :** బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అధ్యక్షతన శుక్రవారం రాష్ట్ర పదాధికారుల సమావేశం జరిగింది. సమావేశానికి కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ భుపథిరజు శ్రినివస వర్మ, ఎంపీ దగ్గుబాటి పురందీశ్వరీ , రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణ, ఎమ్మెల్యేలు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా నాయకులు హాజరయ్యారు. మిగతా 2లో...

## రాజధానిలో గ్లోబల్ వైబ్స్



- అమరావతి నడిబొడ్డున అంతర్జాతీయ ఆతిథ్యం..
- అమరావతిలో 'కోర్టుయార్డ్ బై మారియట్' హోటల్‌కు భూమి పూజ..పాల్గొన్న మంత్రులు కందుల దుర్గేష్, టీజీ భరత్
- 175 గదులు, అత్యున్నత వసతులతో 2028 నాటికి అందుబాటులోకి రానున్న హోటల్
- అమరావతిని గ్లోబల్ సిటీగా మార్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం: మంత్రి కందుల దుర్గేష్

2 లో

## పుదుచ్చేరి సీఎం రంగస్వామి



- పుదుచ్చేరి గవర్నర్‌ను కలిసిన రంగస్వామి.. 13న ప్రమాణస్వీకారం

**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరిలో మరోసారి ఎన్డీయే ప్రభుత్వం కొలువుదీరనుంది. ఎన్డీయే నేతగా ఎన్నికైన ఆల్ ఇండియా ఎన్ఆర్ కాంగ్రెస్ చీఫ్ ఎన్.రంగస్వామి లెఫ్టినెంట్ గవర్నర్ కె.కైలాసనాథన్‌ను శుక్రవారం కలిశారు. మిగతా 4లో...

## కిడ్నీ రోగులకు 'కూటమి' భరోసా


- రాష్ట్రంలో కొత్తగా 12 డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు
- ప్రైవేట్ ఏజెన్సీకి టెండర్ ద్వారా నిర్వహణ భాద్యతలు
- ఇప్పటికే కూటమి పాలనలో 12 కేంద్రాలు ఏర్పాటు
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో కొత్తగా 12 డయాలసిస్ కేంద్రాలు (రక్త శుద్ధి) ఏర్పాటు కాబోతున్నాయి. టెండర్ ద్వారా ఎంపికచేసిన సంస్థ 3 నెలల్లోగా ఈ కేంద్రాల నిర్వహణ బాధ్యతల్ని చేపట్టనుంది. ప్రైమ్ మినిస్టర్ నేషనల్ డయాలసిస్ ప్రోగ్రాం' కింద రాష్ట్రంలోని సెకండరీ ఆసుపత్రుల్లో (జిల్లా, ప్రాంతీయ, సామాజిక) 61 కేంద్రాలు నడుస్తున్నాయి. వీటికి అదనంగా ఈ 12 కేంద్రాలు వస్తున్నాయి. అదనపు కేంద్రాలతో కలిపి మొత్తం 73 అందుబాటులో ఉంటాయి. కొత్త కేంద్రాల రాకతో దూర ప్రాంతాలకు వెళ్లి రక్త శుద్ధి చేయించుకునే రోగులకు అవస్థలు తగ్గుతాయి. ఈ సేవలు పూర్తిగా ఉచితం. ఈ కేంద్రాల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వశీఐదేళ్లకు కలిపి సుమారు రూ. 30 కోట్ల వరకు ఖర్చు పెడుతుంది.

ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల్లో డయాలసిస్ చేయించుకోవాలంటే ఒక్కొక్క సెషన్ కు కనీసం రూ.3,000 నుంచి రూ.4,000 వరకు వ్యయమవుతుంది. ఒక్కొక్కరికి నెలకు నాలుగైదుసార్లు రక్త శుద్ధి చేయాల్సి ఉంటుంది. మిగతా 2లో...

## బీసీ బిడ్డల విద్యకు 'వసతి' దన్ను



- పెనుకొండకు కొత్తగా 3 బీసీ హాస్టళ్లు మంజూరు
- పరిగి, రొద్దం, సోమందేపల్లిలో ఏర్పాటు
- రెండు బాలికల హాస్టళ్లు, ఒక బాలుర హాస్టల్
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి హాస్టళ్లు ప్రారంభం
- విద్యార్థులను చేర్పించేలా బీసీ సంక్షేమశాఖాధికారులు కసరత్తు
- హాస్టళ్ల మంజూరులో ఫలించిన మంత్రి సవిత కృషి
- బీసీ బిడ్డలకు ఉన్నత విద్యే లక్ష్యం : మంత్రి సవిత

**పెనుకొండ (జర్నలిస్ట్ ఫైల్) :** బీసీల విద్యకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా ఎస్.సవిత నేతృత్వంలో బీసీ బిడ్డలకు విద్యతో పాటు ఆరోగ్య భద్రత, నాణ్యమైన ఆహారం అందిస్తోంది. ప్రభుత్వమందించిన ప్రోత్సాహంతో ఇటీవల విడుదలైన టెన్త్, ఇంటర్ ఫలితాల్లో బీసీ బిడ్డలు అత్యున్నతమైన ఫలితాలు సాధించడమే ఇందుకు నిదర్శనం. ఈ నేపథ్యంలో, శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ నియోజక వర్గంలో వెనుకబడిన తరగతి విద్యార్థులందరికీ విద్య అందేలా కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మిగతా 4లో...

# పుదుచ్చేరి సీఎం రంగస్వామి



(మొదటి పేజీ తరువాయి)

ఎమ్మెల్యేల మద్దతు లేఖను ఆయనకు అందజేశారు. ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించాల్సిందిగా కోరారు. ఆయన అందజేసిన లేఖను రాష్ట్రపతి ఆమోదం కోసం లెఫ్టినెంట్ గవర్నర్ పంపనున్నారు. రంగస్వామితో పాటు భాగస్వామ్య పార్టీల నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు కూడా ఈ సందర్భంగా హాజరయ్యారు.

**13న ప్రమాణస్వీకారం :** రంగస్వామి అందజేసిన లేఖను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం కోసం పంపుతునట్టు లెఫ్టినెంట్ గవర్నర్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. మే 13న రంగస్వామి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నట్టు చెప్పాయి. ముఖ్యమంత్రిగా రంగస్వామి ప్రమాణస్వీకారం చేయనుండటం ఇది ఐదోసారి.

ఇటీవల ముగిసిన ఎన్నికల్లో ఎన్ఆర్ కాంగ్రెస్ 16 సీట్లలో పోటీచేసి 12 చోట్ల గెలిచింది. భాగస్వామ్య పార్టీ అయిన బీజేపీ 10 సీట్లలో పోటీ చేసి 4 చోట్ల గెలిచింది. అన్నాడీఎంకే, ఎన్డీయే భాగస్వామ్య పక్షమైన ఎల్‌జేకే చెరో సీటు గెలుచుకున్నాయి. దీంతో మొత్తం 30 స్థానాల్లో ఎన్డీయే బలం 18కి చేరింది. అసెంబ్లీలో ముగ్గురు నామినేటెడ్ సభ్యులు కూడా ఉంటారు. కాగా, విపక్ష డీఎంకే 5, కాంగ్రెస్ ఒక చోట గెలిచింది. విజయ్ టీవీకే 2 స్థానాల్లో గెలుపొందింది. పాండిచ్చేరి సీఎం పదవికి ఎన్.రంగస్వామి గురువారంనాడు రాజీనామా చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, కొత్త ప్రభుత్వం సాధ్యమైనంత త్వరలోనే గవర్నర్‌ను కలిసి లేఖ ఇవ్వనున్నట్టు చెప్పారు.

# బెంగాల్ పగ్గాలు సువేందుకే



(మొదటి పేజీ తరువాయి)

సోనార్ బంగ్లా కలల సాకారానికి కొత్త ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. తృణమూల్ కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలను ఓడిస్తూ తీర్పునిచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. బెంగాల్ ఎన్నికల్లో పలు బెదిరింపుల, హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నప్పటికీ ప్రజలు బీజేపీపై విశ్వాసం ఉంచారని, తమ ప్రభుత్వం ఏర్పాటు కాగానే చొరబాటుదారులు, గోవుల అక్రమరవాణాకు పూర్తిగా కళ్లెం వేస్తామని స్పష్టం చేశారు.

'సోనార్ బంగ్లా లక్ష్య సాధన దిశగా పనిచేయడం, బెంగాల్ ప్రజల అంచనాలను నిలబెట్టడం మన బీజేపీ కార్యకర్తలందరి బాధ్యత. కవిగురు రవీంద్రనాథ్ ఠాగూర్ కలలు గన్న భయంలేని, ఆత్మగౌరవంతో తలెత్తుకుని జీవించే బెంగాల్ వైపు నేడు మన ప్రయాణం సాగుతోంది' అని అమిత్‌షా అన్నారు.

బెంగాల్ లెజిస్లేటివ్ పార్టీ నేత ఎన్నిక ప్రక్రియను పర్యవేక్షిచేందుకు కేంద్ర పరిశీలకుడిగా అమిత్‌షా శుక్రవారంనాడు హాజరయ్యారు. ఈ సమావేశంలో సువేందు పేరు ప్రతిపాదనకు రాగా, కొత్తగా ఎంపికైన ఎమ్మెల్యేలు ఏకగ్రీవంగా ఆమోదించారు. దీంతో సువేందు అధికారిని బీజేపీ లెజిస్లేటివ్ పార్టీ నేతగా అమిత్‌షా ప్రకటించారు. ఈనెల 9వ తేదీన కోల్‌కతాలోని బ్రిగేట్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే కార్యక్రమంలో బీజేపీ ప్రభుత్వం ప్రమాణస్వీకారం చేయనుంది.

# కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, ఎస్పీ



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో(జర్నలిస్ట్ ఫైల్):** ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్ రెండవ రోజు శుక్రవారం జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ, పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్ పాల్గొన్నారు.

# ట్రంప్‌నకు చుక్కెదురు



**వాషింగ్టన్ :** ప్రపంచ దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన పది శాతం సుంకాన్ని అంతర్జాతీయ వాణిజ్య న్యాయస్థానం 2-1 మెజారిటీతో కొట్టివేసింది. అడ్డగోలుగా విధించిన ఈ సుంకాలు చట్టవిరుద్ధమని స్పష్టం చేసింది. వాణిజ్య భాగస్వామ్య దేశాలపై ట్రంప్ విధించిన ప్రతీకార సుంకాలు చెల్లబోవని అమెరికా సుప్రీంకోర్టు ఫిబ్రవరిలోనే తీర్పు చెప్పిన విషయం తెలిసిందే. దీంతో ట్రంప్ ప్రభుత్వం మరోసారి ఆయా దేశాలపై పది శాతం చొప్పున తాత్కాలిక సుంకాలు విధించింది. ఇవి జూలై 24 వరకూ అమలులో ఉంటాయి. ట్రంప్ విధించిన పది శాతం సుంకాలను వ్యతిరేకిస్తూ అమెరికాలోని 24 రాష్ట్రాలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. దీనిపై తాజాగా విచారణ జరిపిన ఫెడరల్ కోర్టు ట్రంప్ ప్రభుత్వ నిర్ణయాన్ని కొట్టివేసింది. అధ్యక్షుడికి ఉన్న విస్తృతాధికారాలతో 1974 నాటి వాణిజ్య చట్టంలోని సెక్షన్ 122 కింద సుంకాలను విధించారని ప్రభుత్వం వాధించింది. న్యాయస్థానం ఆ చట్టం చెల్లింపుల సంక్షోభం ఏర్పడిన సమయంలో మాత్రమే ఉపయోగించాలని, ప్రస్తుత పరిస్థితికి అది వర్తించదని స్పష్టం చేసింది. సుంకాలపై అధ్యక్షుడికి అమెరికా ప్రతినిధి సభ కల్పించిన అధికారాలను ట్రంప్ అతిక్రమించారని, ఆయన విధించిన టారిఫ్‌లు చట్టవిరుద్ధ మైనవని తీర్పు చెప్పింది. ధర్మాసనంలోని ఇద్దరు న్యాయమూర్తులు ట్రంప్ ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించగా, ఒకరు మాత్రం దానిని సమర్థించారు. న్యాయస్థానం ఐదు రోజుల్లో తీర్పు అమలు చేయాలని ఆదేశించింది. మరోవైపు ట్రంప్ యంత్రాంగం ఈ తీర్పును అప్పీలు చేసే అవకాశం ఉంది.

# బీసీ బిడ్డల విద్యకు 'వసతి' దన్ను

(మొదటి పేజీ తరువాయి)

నియోజక వర్గంలో కొత్తగా మూడు బీసీ హాస్టళ్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. పరిగి, రొద్దం, సోమందేపల్లిలో ఏర్పాటు చేయబోయే ఈ బీసీ హాస్టళ్లను వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించడానికి ఇప్పటికే చర్యలు చేపట్టింది. పరిగి, రొద్దంలో బాలికల హాస్టళ్లను, సోమందేపల్లిలో బాలుర హాస్టల్ ను ఏర్పాటు చేయనున్నారు. ఈ మూడు హాస్టళ్ల నిర్వహణకు హెచ్.డబ్ల్యూ.వో.లను(వార్డెన్లు) నియమించే పనిలో జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారులు తలమునకలయ్యారు. కొత్తగా ఏర్పాటు చేయబోయే హాస్టళ్లలో బీసీ విద్యార్థులు చేరేలా అధికారులు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం శ్రీ సత్యసాయి జిల్లాలో 61 బీసీ హాస్టళ్లు ఉన్నాయి. పెనుకొండ నియోజ వర్గంలో నాలుగు బీసీ హాస్టళ్లు ఉన్నాయి. వాటిలో రెండు పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు కాగా, మరో రెండు ప్రీ మెట్రిక్ హాస్టళు . ఇప్పుడు కొత్తగా ఏర్పాటు చేయబోయే మూడు హాస్టళ్లను కలిపి జిల్లాలో హాస్టళ్ల సంఖ్య 64కు చేరుకోనుంది.

**వార్డెన్ల నియామకానికి కసరత్తు :** వచ్చే నెలలో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానుండడంతో, కొత్తగా ఏర్పాటుచేయబోయే హాస్టళ్లలో హెచ్.డబ్ల్యూ.వో.లను(వార్డెన్లు) నియామకానికి జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారులు చర్యలు ప్రారంభించారు. తమ శాఖలో సిబ్బంది కొరత కారణంగా, ఇతర శాఖలకు చెందిన ఉద్యోగులను నియమించాలని ఆ శాఖ జిల్లా అధికారులు



భావిస్తున్నారు. ఇందుకు సంబంధించి కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌కు ఓ లేఖను సైతం జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారులు రాశారు. హెచ్.డబ్ల్యూ.వో.ల (వార్డెన్లు) నియామకంపై ఇతర శాఖల అధికారులకు లేఖ రాశారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలనకు, హెచ్.డబ్ల్యూ.వోల నియామకానికి ఓ కమిటీని ఏర్పాటు చేయబోతున్నారు. కొద్ది రోజుల్లోనే హెచ్.డబ్ల్యూ.వోల నియమించేలా బీసీ సంక్షేమశాఖాధికారులు చర్యలు ప్రారంభించారు.

**హాస్టళ్ల మంజూరులో ఫలించిన మంత్రి సవిత కృషి :** నియోజక వర్గంలో బీసీ విద్యార్థులకు ఉన్నతవిద్య అందించాలన్న లక్ష్యంతో మంత్రి సవిత పనిచేస్తున్నారు. పేదలు, కూలీల పిల్లలు విద్యకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో నియోజక వర్గంలో కొత్తగా మూడు బీసీ హాస్టళ్లు ఏర్పాటు చేసేలా మంత్రి సవిత కృషి చేశారు. సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి, పేదరికంతో బీసీ బిడ్డల డ్రాపౌట్లు పెరుగుతున్నాయని వివరించారు. ఉన్నత విద్య చదవాలని ఉన్నా పేదరికం కారణంగా మరికొందరు బడి బయటే ఉండిపోతున్నారని తెలిపారు. మంత్రి సవిత వినతిని మన్నించి, పెనుకొండ నియోజక వర్గంలో మూడు బీసీ హాస్టళ్ల ఏర్పాటుకు పచ్చజెండా ఊపారు. కొత్తగా ఏర్పాటు చేయబోయే పరిగి, రొద్దం, సోమందేపల్లిలో బీసీ హాస్టళ్లలో విద్యార్థులను చేర్పించడానికి బీసీ సంక్షేమ శాఖాధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు ప్రారంభించారు. ఆసక్తి కలిగిన విద్యార్థులను గుర్తించి, బీసీ హాస్టళ్లలో చేర్పించాలని జిల్లాలో మండల విద్యాశాఖాధికారులను, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను కోరారు. పేద, వలస కూలీల పిల్లలతో పాటు హాస్టళ్లలో ఉంటూ చదువుకోవాలని ఆస్తకి చూపే బీసీ విద్యార్థులను ఈ మూడు హాస్టళ్లలో చేర్పించేలా కృషి చేస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి, తమ బిడ్డలను బీసీ హాస్టళ్లలో చేర్పించాలని కోరుతున్నారు.

**బీసీ బిడ్డలకు ఉన్నత విద్యే లక్ష్యం : మంత్రి సవిత :** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ బిడ్డలకు ఉన్నత విద్య అందించాలన్నదే సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలిపారు. బీసీ హాస్టళ్లు, గురుకులాల అభివృద్ధికి గతంలో ఎన్నడూ లేనంతగా నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. సన్న బియ్యం భోజనంతో కూడిన మెనూ అమలు చేస్తూ, నాణ్యమైన ఆహారం అందిస్తున్నామన్నారు. పరిశుద్ధమైన తాగునీరు అందించడానికి ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశామన్నారు. మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా పారిశుధ్య సిబ్బందిని, రుచికరమైన భోజనం అందించడానికి కుక్ లు, కమాటీలను నియమించామన్నారు. తరగతి గదులు, విశ్రాంతి గదుల్లోకి దోమలు చొరబడకుండా ఉండేలా దోమ తెరలు ఏర్పాటు చేశామన్నారు. టెన్త్, ఇంటర్ లో మెరుగైన ఫలితాలు సాధించడానికి నిష్ణాతులైన ఉపాధ్యాయుల బోధనలతో పాటు మెటీరియల్ అందజేస్తున్నామన్నారు. హాస్టళ్లు, గురుకులాల ద్వారా బీసీ బిడ్డలకు ఆరోగ్య, ఆహార భద్రతతో కూడిన విద్య అందిస్తున్నామన్నారు. నియోజక వర్గంలో బీసీ బిడ్డలెవరూ బడి బయట ఉండకూడదనే లక్ష్యంతో, పరిగి, రొద్దం, సోమందేపల్లిలో బీసీ హాస్టళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. బీసీ హాస్టళ్లలో చదివే విద్యార్థులకు తల్లికి వందనం, విద్యామిత్ర కిట్లు అందజేస్తామన్నారు. విద్యతోనే ఉన్నత స్థానాలకు చేరుకోవొచ్చని, బీసీ సామాజిక వర్గానికి చెందిన తల్లిదండ్రులు తమ బిడ్డను బడిలో చేర్పించాలని కోరారు. విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుకుంటూ, వారికి విద్యతో పాటు ఆరోగ్య, రక్షణ భద్రత కల్పిస్తామని మంత్రి సవిత తెలిపారు.

# డప్పు కళాకారుల భారీ ప్రదర్శన పోస్టర్లను విడుదల చేసిన బీజేపీ




**విజయవాడ,(జర్నలిస్ట్ ఫైల్):** ఈనెల 17వ తేదీన విజయవాడలో వేలాదిమంది డప్పు కళాకారులు, వివిధ కళాకారుల సంఘాలతో నిర్వహించనున్న భారీ ప్రదర్శనకు సంబంధించిన వాల్ పోస్టర్లను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ విడుదల చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ డప్పు కళాకారులు తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని పేర్కొన్నారు. కళాకారుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం, వారి సంక్షేమం కోసం కృషి చేయడం లక్ష్యంగా ఈ భారీ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిమంది కళాకారులు పాల్గొననున్నారని వెల్లడించారు.

కార్యక్రమంలో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణ, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్, బీజేపీ ఎమ్మెల్యే పక్ష నేత పెనమత్స విష్ణుకుమార్ రాజు, ఎమ్మెల్యేలు డా. పార్థశారధి, ఎన్. ఈశ్వరరావు, ఆదినారాయణ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కపు రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అమరావతి అభివృద్ధిలో మీదే కీలక పాత్ర - రైతుల ముంగిటకు సీఆర్డీఏ!



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** నవ్యాంధ్ర రాజధాని అమరావతి నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ఈ మహా నగర అభివృద్ధిలో రైతులు కేవలం ప్రేక్షకులు కాదు, కీలక భాగస్వాములు కావాలని ఆంధ్రప్రదేశ్ సీఆర్డీయే స్పష్టం చేసింది. భూసేకరణ కంటే భూసమీకరణ విధానమే రైతులకు ఎంతో లాభదాయకమని సీఆర్డీయే కమిషనర్ వి. విజయరామరాజు వెల్లడించారు. రాజధాని నిర్మాణంలో ఉన్న అడ్డంకులను తొలగించేందుకు ఆయన శుక్రవారం రాజధాని గ్రామాల్లో పర్యటించారు. రైతులతో ముఖాముఖిగా గ్రామసభలు నిర్వహించి, వారి సమస్యల పరిష్కారానికి స్పష్టమైన హామీ ఇచ్చారు. ఈ గ్రామసభల్లో చర్చించిన అంశాలు, రైతులకు లభించిన హామీల పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

**గ్రామాల్లో సభలు, రైతుల వద్దకే పాలన :** రాజధాని పనుల్లో వేగం పెంచాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. ఇందుకోసం క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను తెలుసుకునే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. శుక్రవారం తుళ్లూరు మండలం పరిధిలో సీఆర్డీయే అధికారులు విస్తృతంగా పర్యటించారు. లింగాయపాలెం, ఉద్దండరాయునిపాలెం గ్రామాల్లో సీఆర్డీయే ఆధ్వర్యంలో ప్రత్యేకంగా గ్రామసభలు నిర్వహించారు. ఈ ప్రతిష్టాత్మక సభలకు సీఆర్డీయే కమిషనర్ విజయరామరాజు స్వయంగా హాజరయ్యారు. అక్కడి రైతులు, స్థానికులతో ఆయన నేరుగా, ఎంతో ఓపికగా సుదీర్ఘంగా చర్చలు జరిపారు.

**భూసమీకరణే శ్రీరామరక్ష, ప్రయోజనాలు మెండు :** రాజధానిలో మౌలిక వసతుల కల్పన, ఎల్పీఎస్ జోన్ల అభివృద్ధి అత్యంత కీలకం. రాజధానిలో ప్రధాన రహదారుల నిర్మాణానికి కొంత భూమి అవసరం ఉంది. వీటి కోసం ఇప్పటికే అధికారులు భూసేకరణ నోటిఫికేషన్లు జారీ చేశారు. అయినా సరే ఈ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కమిషనర్ స్పష్టం చేశారు. భూసేకరణ నోటిఫికేషన్ విడుదలైనప్పటికీ, రైతులు ఇంకా స్వచ్ఛందంగా భూసమీకరణ విధానంలో చేరే అవకాశం ఉందన్నారు. బలవంతపు భూసేకరణ వల్ల రైతులకు కేవలం ఒకేసారి పరిహారం దక్కుతుంది. కానీ, భూసమీకరణ ద్వారా రాజధానిలో అభివృద్ధి చెందిన అత్యుత్తమ ప్లాట్లు వాళ్లకు తిరిగి వస్తాయి. దీనివల్ల రైతులకు భవిష్యత్తులో ఎంతో మెరుగైన, శాశ్వతమైన ఆర్థిక ప్రయోజనాలు చేకూరుతాయి.

**ఆ సువర్ణ అవకాశాన్ని వదులుకోవద్దు! :** రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టపోకూడదన్నదే ప్రభుత్వ ఉద్దేశమని సీఆర్డీయే చెబుతోంది. అందుకే భూసమీకరణ అనే సువర్ణ అవకాశాన్ని ప్రతి రైతూ వినియోగించుకోవాలని కమిషనర్ పిలుపునిచ్చారు. రాజధాని ఎదుగుతున్న కొద్దీ ఆటోమేటిక్‌గా వారి భూమి విలువ అనూహ్యంగా పెరుగుతుందన్నారు. నగర అభివృద్ధిలో అందరూ భాగస్వాములుగా మారాలని ఆయన కోరారు. రాజధాని కోసం భూములిచ్చిన రైతుల త్యాగాలు వృథా కాకుండా చూసుకునే బాధ్యత ప్రభుత్వానిదేనని భరోసా ఇచ్చారు.

**గ్రామకంఠం సమస్యలకు శాశ్వత చెక్ :** ఈ గ్రామసభల్లో రైతులు తమ ప్రధాన సమస్యలను అధికారుల ముందు నిక్కచ్చిగా ఉంచారు. ఏళ్ల తరబడి తమను వేధిస్తున్న 'గ్రామకంఠం' స్థలాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సీఆర్డీయే కమిషనర్ విజయరామరాజు సానుకూలంగా స్పందించారు. గ్రామకంఠం ఇబ్బందుల వల్ల రైతులు పడుతున్న సమస్యలు సీఆర్డీయేకు తెలుసన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి అధికారుల దగ్గర ఇప్పటికే ఒక పటిష్టమైన కార్యాచరణ సిద్ధంగా ఉందన్నారు. ఆ ప్రణాళికతో సీఆర్డీయే అత్యంత వేగంగా, పక్కాగా ముందుకు వెళ్తోందని వివరించారు. రైతులకు పూర్తిస్థాయిలో ఊరట కలిగించేలా అతి త్వరలోనే గ్రామకంఠం సమస్యలకు ఒక శాశ్వత పరిష్కారం చూపుతామని స్పష్టమైన హామీ ఇచ్చారు.

**కొత్త ఉత్సాహంతో అడుగులు :** కమిషనర్ పర్యటన, గ్రామసభల నిర్వహణతో రాజధాని రైతుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. తమ సమస్యలను వినడానికి, వాటిని పరిష్కరించడానికి ఉన్నతాధికారులు నేరుగా రావడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యలు పరిష్కారం అయితే రాజధాని అభివృద్ధి పనులకు ఇక ఎలాంటి ఆటంకాలు ఉండవని స్థానికులు అంటున్నారు.

# 72 గంటల్లో ఇండెక్స్ కార్డులు, గణాంకాల నివేదికలు




**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** పలు రాష్ట్రాల అసెంబ్లీలకు జరిగిన ఎన్నికలు, ఉప ఎన్నికలకు సంబంధించి ఇండెక్స్ కార్డులను, గణాంకాల నివేదికలను ఎన్నికల కమిషన్ శుక్రవారం ప్రచురించింది. ఫలితాలు వెలువడిన రికార్డు సమయం 72గంటల్లోగా వీటిని అందచేసింది. ఈ నెల 6వతేదీతో ఎన్నికల ప్రక్రియ ముగిసిన 830 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఈ డేటా విడుదలైంది. ఇండెక్స్ కార్డులు, గణాంకాల నివేదికలను డిజిటల్‌గా ఆధునీకరించడం, వేగంగా ప్రచురించడమనేది గత ఏడాది కాలంలో ఎన్నికల కమిషన్ తీసుకున్న 30కి పైగా చొరవల్లో చివరిది. ఈ మేరకు ఇసి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఇసిఐనెట్ ప్లాట్‌ఫారమ్‌ను ప్రవేశపెట్టడానికి ముందుగా, ఫీల్డ్ ఆఫీసర్ల ద్వారా ఈ డేటాను సమీకరించి, పొందుపరరచడానికి అనేక వారాలు,నెలలు పట్టేదని ఇసి పేర్కొంది. ఇండెక్స్ కార్డుల్లో డేటా సమగ్రంగా వుంటుంది. అభ్యర్థి వివరాలు, ఓటర్లు, పోలైన ఓట్లు, పార్టీల వారీగా వచ్చిన సీట్లు ఇలా అన్ని రకాల సమాచారం పొందుపరిచి వుంటుంది. ఇప్పుడు ఈ రికార్డులు ఇసిఐనెట్ యాప్ ద్వారా ప్రజలకు అందుబాటులో వుంటున్నాయి. ఇసిఐ అధికార వెబ్‌సైట్‌లో కూడా వుంటాయి. వీటితో పాటూ 14 గణాంకాల నివేదికలను కూడా ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. ఫలితాలు వెలువడిన కేవలం మూడు రోజుల వ్యవధిలోనే ఈ నివేదికలన్నీ అందుబాటులోకి తీసుకురావడం ఇదే మొదటిసారి. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓటర్ పోలింగ్, లింగాల వారీగా ప్రాతినిధ్యం, నియోజకవర్గాల వారీగా సవివరమైన ఫలితాల విశ్లేషణలు, ఇలా వివిధ అంశాలకు సంబంధించిన సమగ్ర విశ్లేషణను ఈ నివేదికలు అందచేస్తాయి. పరిశోధకులు, ప్రజలతో సహా దీనితో సంబంధమున్న ప్రతి ఒక్కరి పారదర్శకతను పెంపొందించే లక్ష్యంతో తమకు తాముగా ఈ చర్యలు చేపట్టామని ఎన్నికల కమిషన్ ప్రకటించింది. పశ్చిమ బెంగాల్‌లో ఫాల్టా అసెంబ్లీ నియోజకవర్గానికి ఈ నెల 21న రీ పోలింగ్ జరుగుతుందని కమిషన్ ప్రకటించింది. రెండో దశలో భాగంగా ఏప్రిల్ 29న ఈ స్థానానికి జరిగిన పోలింగ్ సందర్భంగా అనేక ఫిర్యాదులు తలెత్తాయి. దాంతో మొత్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో రీ పోలింగ్‌కు ఆదేశించారు.

# బీజేపీ విజయానికి కృషి చేసిన మధుకర్‌కు ఘన సత్కారం



**విజయవాడ,(జర్నలిస్ట్ ఫైల్):** బీజేపీ రాష్ట్రకార్యాలయంలో రాష్ట్రఅధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన రాష్ట్ర పదాధికారుల సమావేశంలో పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేసిన ఆంధ్రప్రదేశ్ బీజేపీ సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్ కు ఘన సత్కారం నిర్వహించారు.

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ శ్రేణులను సమన్వయం చేస్తూ, ప్రచార కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించి మంచి ఫలితాలు సాధించడంలో కీలక పాత్ర పోషించినందుకు ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ మధుకర్ జీకి స్వీట్లు తినిపించి అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ సాధించిన విజయం దేశ రాజకీయాల్లో చారిత్రాత్మక మైలురాయిగా నిలిచిందన్నారు. పార్టీ విజయానికి కృషి చేసిన ప్రతి కార్యకర్తకు అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో కూడా ఇదే ఉత్సాహంతో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు, ఎమ్మెల్యేలు, కార్యవర్గ సభ్యులు, జిల్లా అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# బదిలీల పేరుతో కేజీబీవీ ఉపాధ్యాయులను వేధించరాదు : ఏపీటీఎఫ్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో సాధారణ బదిలీల షెడ్యూల్ ప్రభుత్వం విడుదల చేయకపోయినా, సమగ్ర శిక్ష శాఖ ఉన్నతాధికారుల మౌఖిక ఆదేశాలతో కేజీబీవీ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న ప్రిన్సిపల్స్, పీజీటీ, టీజీటీ ఉపాధ్యాయులను నిర్బంధ బదిలీలకు గురిచేయడాన్ని వెంటనే నిలిపివేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకత్వం డిమాండ్ చేసింది.

ఈ మేరకు కేజీబీవీ సెక్రటరీ డి.దేవేంద్ర రెడ్డికు ప్రాతినిధ్యం చేసినట్లు ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు, ప్రధాన కార్యదర్శి ఎస్. చిరంజీవి తెలిపారు.

ప్రభుత్వం ఇప్పటివరకు ఏ శాఖలోనూ బదిలీల ప్రకటన చేయకపోయినా, కనీస టైమ్ స్కేల్ (ఎంఎటీఎస్) కూడా అమలు కాని, ఉద్యోగ భద్రత లేని కేజీబీవీ ఉపాధ్యాయులను 'లాంగ్ స్టాండింగ్' పేరుతో జిల్లాల మధ్య బదిలీలు చేయడం అన్యాయమని వారు పేర్కొన్నారు. దీంతో ఉపాధ్యాయులు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అస్పష్టమైన నిబంధనలతో బదిలీల ప్రక్రియ చేపట్టడం వల్ల ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. ఈ అంశంపై కేజీబీవీ సెక్రటరీ దేవానంద రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

# కేరళ సిఎం ఎంపికలో జాప్యం

**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** కేరళలో కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని యుడిఎఫ్ విజయం సాధించినప్పటికీ, సిఎం ఎంపికలో తీవ్రమైన జాప్యం జరుగుతోంది. కాంగ్రెస్ లో ముగ్గురు నేతలు సిఎం కుర్చీ కోసం పోటీ పడుతున్నారు. తమ నేతే సిఎం అంటూ వారి మద్దతుదారులు రాష్ట్రవ్యాప్తంగా పోటాపోటీగా ప్రదర్శనలు చేయడంతోపాటు ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. సోషల్ మీడియాలోనూ తమ నేత గొప్పంటూ ప్రచారం చేసుకుంటున్నారు. ఈ పరిణామాలు కాంగ్రెస్ పార్టీకి పెద్ద తలనొప్పిగా మారాయి. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం వద్ద మంచి సంబంధాలు ఉన్న ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కెసి వేణుగోపాల్ తనకు సిఎంగా అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ఐదేళ్లపాటు ప్రతిపక్షనేతగా ఉన్న విడి సతీసన్, 2016 నుంచి 2021 వరకు ప్రతిపక్ష నేతగా ఉన్న రమేష్ చెన్నితాల కూడా సిఎం రేసులో ఉన్నారు.

## కంఠ మహేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనకు ఘన ఏర్పాట్లు

**– 4 రోజులపాటు పూజా కార్యక్రమాలు, భక్తులకు ఆహ్వానం**



నేలకొండపల్లి, మే 08 (జర్నలిస్ట్ ఫైల్) : నేలకొండపల్లి మండలంలోని భైరవునిపల్లి గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో శ్రీ శ్రీ శ్రీ కంఠ మహేశ్వరస్వామి, సురమాంబ దేవి, శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి, వన మైసమ్మ దేవతల నూతన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలకు ఘనంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమాలు మే 9 నుండి 12 వరకు నాలుగు రోజులపాటు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, హోమాలు,వివిధ ధార్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భక్తులు కుటుంబ సమేతంగా హాజరై పూజల్లో పాల్గొని దేవతల ఆశీస్సులు పొందాలని గౌడ సంఘం ప్రతినిధులు కోరారు. ఇదిలా ఉండగా, ఏప్రిల్ 9 న ఉదయం 6 గంటలకు శ్రీ శ్రీ శ్రీ కంఠమహేశ్వర స్వామి దేవాలయం నుంచి దేవతల విగ్రహాలను ఊరేగింపుగా గ్రామంలోకి తీసుకువస్తారు. ఈ ఊరేగింపులో గౌడ కులస్తుల, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని పూలు,జలాలతో స్వాగతం పలకాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. ఇఈ కార్యక్రమం మే 12 జరుగుతుందని వారు తెలిపారు.

## శ్రీ వీరాంజనేయ స్వామి కృప ప్రజలందరిపై ఉండాలి

**మాజీ ఉపసర్పంచ్ పిన్నింటి హరిత**

**మల్లాపూర్ తండాలో శ్రీ వీరాంజనేయ స్వామి 8వ వార్షికోత్సవం**

**భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసిన మాజీ ఉపసర్పంచ్ పిన్నింటి హరిత**



షాద్నగర్ నియోజకవర్గం మే 08 (జర్నలిస్ట్ ఫైల్) : శ్రీ వీరాంజనేయ స్వామి కృప ప్రజలందరిపై ఉండాలని మాజీ ఉపసర్పంచ్ పిన్నింటి హరిత అన్నారు. గురువారం కొత్తూరు మండలంలోని మల్లాపూర్ తండాలో సర్పంచ్ మీనాక్షి దశరథ్ నాయక్ ఆధ్వర్యంలో శ్రీ వీరాంజనేయ స్వామి 8వ వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఉపసర్పంచ్ పిన్నింటి హరిత హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శ్రీ వీరాంజనేయ స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ చల్లగా ఉండాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ సర్పంచ్ చిట్టేడి నరసింహారెడ్డి,వార్డ్ సభ్యులు సునీత శంకర్,దశరథ్, జయేందర్,రాజు,మురళి,భరత్, దయానంద్,శ్రీను,నరేష్, నరసింహ,శంకర్,మహేందర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## ఎస్.ఆర్ & బి.జి.ఎన్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్వయం ప్రతిపత్తి ఖమ్మం

**పత్రికా ప్రచురణార్థం**

**19 వరకు అంబేద్కర్ --- ఓపెన్ యూనివర్సిటీ ఫీజు గడువు**

ఖమ్మం, మే 08(జర్నలిస్ట్ ఫైల్): స్థానిక ఎస్ ఆర్ బి జి ఎన్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఉన్న డా.బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రాంతీయ అధ్యయన కేంద్రంలో డిగ్రీ ప్రథమ సంవత్సరం రెండవ సెమిస్టర్, ద్వితీయ సంవత్సరం నాలుగవ సెమిస్టర్, తృతీయ సంవత్సరం ఆరవ సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులు తమ పరీక్ష ఫీజులను ఈ నెల 19 వతేదీ వరకు ఆన్లైన్లో లేదా మీ సేవా కేంద్రాల్లో చెల్లించాలని కళాశాల ప్రిన్సిపాల్ డా.మొహ్మద్ జాకిరుల్లా, అధ్యయన కేంద్ర కోఆర్డినేటర్ డా.బి.వీరన్న సంయుక్త ప్రకటనలో గురువారం తెలిపారు. పరీక్షలు జూన్ 14నుంచి ప్రారంభ కానున్నాయని వెల్లడించారు.సైన్స్ విద్యార్థులు పరీక్ష ఫీజు తో పాటు ప్రాక్టికల్ పరీక్షల ఫీజులను కూడా చెల్లించాలని, రసీదులను భద్ర పరుచుకోవాలని సూచించారు.మరిన్ని వివరాలకు డాక్టర్ బి ఆర్ ఐతీ.దీ=ూాాఖ.ూఅశ్రీఅఅవ.అఅ వెబ్ సైట్ ను సందర్శించాలని తెలిపారు.

## నందిగామ సింగిల్ విండో చైర్మన్ గా తోట రాజగోపాల్ బాధ్యతల స్వీకరణ

**హైకోర్టు ఆదేశాల మేరకు పాత పాలకవర్గాలే యథావిధిగా బాధ్యతలు స్వీకరణ**





షాద్నగర్ నియోజకవర్గం మే 08 (జర్నలిస్ట్ ఫైల్) : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో మళ్లీ పాత పాలకవర్గాలే కొనసాగనున్నాయి. యధావిధిగా పాత పాలకవర్గాలే కొనసాగించాలంటూ హైకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో గురువారం రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం సింగిల్ విండో చైర్మన్ గా తోట రాజగోపాల్ మళ్లీ బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో పాటు పాత పాలకవర్గాలు (పాత కమిటీలు) యథావిధిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా హైకోర్టు తీర్పు పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు.

## తలకొండపల్లిలో నీటి సమస్య కు చెక్ సర్పంచ్ శేఖర్ యాదవ్

**-ప్రజల అవసరాలే మా మొదటి ప్రాధాన్యత -సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు తలకొండపల్లి సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్**



(జర్నలిస్ట్ ఫైల్) తలకొండపల్లి మే 08 : తలకొండపల్లి గ్రామంలో సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్ ఎండాకాలం తాగునీటి సమస్య తలేత్తకుండా గ్రామ ప్రజల కోరిక మేరకు బోర్ డ్రిల్లింగ్ వేయటం జరిగింది. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల కేంద్రంలో మంచినీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించడం మా పాలకవర్గానికి ఎంతో సంతృప్తిని ఇస్తోంది అని సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్ తెలిపారు, గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరిని భాగస్వాములను చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్,ఉప సర్పంచ్ నూకం కోటేశ్వర్, జ్యోత్తయ్య, పంచాయతీ సెక్రెటరీ సత్యం,వార్డ్ సభ్యులుమల్లీశ్వరి,జంగయ్య, పోతుగంటి కుమార్,ఇట్టామోని వెంకటేష్,అలివేల, అంజయ్య, ఇట్టామోని లతడమల్లేష్, తుమ్మ ప్రేమలత, నర్సింహా, నాయిని లక్ష్మి కాంత్, పెరుమాళ్ళ జంగయ్య, కటికల లింగం, దోమ మనోహర్ రెడ్డి,కారోబార్ శేఖర్,సజ్జుపాషా తదితరులు పాల్గొన్నారు.

# కాకి లెక్కలతో కాలం గడిపిన కాంగ్రెస్ పాలకవర్గం

**– రూ 4000 కోట్ల అభివృద్ధి అంటూ ప్రజలను మభ్యపెడుతోందని**

**: టీఆర్ఎస్ కార్పొరేటర్ల మండిపాటు**




ఖమ్మం, మే 08 (జర్నలిస్ట్ ఫైల్) : ఖమ్మం కార్పొరేషన్లో ఐదేళ్ల పదవీకాలం ముగుస్తున్న సందర్భంగా గురువారం టీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో టీఆర్ఎస్కు చెందిన కార్పొరేటర్లు ఏర్పాటు చేసిన పత్రికా విలేఖరుల సమావేశంలో కాంగ్రెస్ పాలకవర్గంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ సమావేశంలో పగడాల నాగరాజు, కర్నాటి కృష్ణ, మక్బూల్, శీలంశెట్టి వీరభద్రం, తోట రామారావు, నాగండ్ల కోటి, బిక్కసాని ప్రశాంతలక్ష్మి మాట్లాడుతూ మేయర్ నిర్వహించిన పత్రికా సమావేశాన్ని తీవ్రంగా ఖండించారు. ఖమ్మం నగరాన్ని రూ.4000 కోట్లతో అభివృద్ధి చేశామని కాంగ్రెస్ నాయకులు చెప్పడం పూర్తిగా అబద్ధాల పర్వమని, ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నమని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు పూర్తవుతున్నప్పటికీ ఖమ్మం నగరంలో చెప్పుకోదగ్గ అభివృద్ధి ఏదీ కనిపించడం లేదన్నారు. మారింది ఒక్కటే ఉందంటే బిఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన మేయర్, కార్పొరేటర్ల రాజకీయ రంగులేనని ఎద్దేవా చేశారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ హయాంలో ఖమ్మం నగరం ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చెందిందన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి దశాబ్దాల పాటు కాంగ్రెస్ పార్టీ పాలించినప్పటికీ ఖమ్మాన్ని మురికి కూపంగా వదిలేసిందని, కానీ బిఆర్ఎస్ ప్రభుత్వం ఆ నగరాన్ని సీతాకోకచిలుకలా తీర్చిదిద్దిందని పేర్కొన్నారు. “60 ఏళ్ల అభివృద్ధిని ఆరు సంవత్సరాల్లో చేసి చూపించిన ఘనత బిఆర్ఎస్ పార్టీది, పువ్వాడ అజయ్ కుమార్ దే” అని అన్నారు. తాము చేసిన అభివృద్ధి పనులను ఒక్కొక్కటిగా ప్రజల ముందుంచ గలమని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పుకుంటున్న రూ.4000 కోట్ల అభివృద్ధి ఎక్కడ జరిగిందో ప్రజలకు వివరించే ధైర్యం వారికి లేదని ప్రశ్నించారు.

ఖమ్మంలో నూతన బస్టాండ్, కొత్త కార్పొరేషన్ కార్యాలయం, నూతన కలెక్టరేట్, సెంటర్ లైటింగ్లు, డివైడర్లు, వైకుంఠధామాలు, పార్కులు, ఎన్ఎస్పీ వాక్వేలు, లకారం ట్యాంక్బండ్, కూడళ్ల సుందరీకరణ, బస్తీ దవాఖానాలు, డబుల్ బెడ్రూమ్ ఇళ్లు, నర్సరీలు, ప్రతి ఇంటికి మంచినీటి సరఫరా వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే జరిగాయని గుర్తుచేశారు. ప్రస్తుతం మున్నేరు మీద నిర్మాణంలో ఉన్న తీగల వంతెన, మున్నేరు ఇరువైపులా నిర్మిస్తున్న సీసీ వాల్ పనులను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఖాతాలో వేసుకోవడం ప్రజల చెవుల్లో పువ్వులు పెట్టడమేనన్నారు. భారీ వరదల సమయంలో మున్నేరు పరివాహక ప్రాంత ప్రజల ఇబ్బందులను చూసిన మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ వెంటనే స్పందించి సుమారు రూ.180 కోట్లతో తీగల వంతెనకు, రూ.800 కోట్లతో మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణాలకు నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించారని తెలిపారు. “మందికి పుట్టిన బిడ్డను మా బిడ్డ అని చెప్పుకునేలా కాంగ్రెస్ నాయకులు ప్రవర్తిస్తున్నారు. మిమ్మల్ని గెలిపించిన ప్రజలే ఇప్పుడు మీ మాటలు విని అసహ్యించుకుంటున్నారు” అని మండిపడ్డారు. త్వరలో కార్పొరేషన్ ఎన్నికల్లో మళ్లీ ప్రజల ముందుకు వెళ్లాల్సి ఉంటుందని, ఇప్పటికైనా అబద్ధపు ప్రచారాలు మానుకోవాలని, లేకపోతే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. బడుగు బలహీన వర్గాలు, మైనారిటీలకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన న్యాయం ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మైనారిటీల కోసం షాదీఖానా నిర్మాణానికి స్థలం కేటాయించి నిధులు మంజూరు చేయగా, ప్రభుత్వం మారిన తర్వాత ఆ పనులను నిలిపివేశారని తెలిపారు. అదేవిధంగా బీసీ భవన్ నిర్మాణ పనులను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిందని ఆరోపించారు. బడుగు బలహీన వర్గాలు, మైనారిటీల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వ అసలు వైఖరి ప్రజలకు అర్థమవుతోందన్నారు. ఉన్నవి లేనట్టుగా, లేనివి ఉన్నట్టుగా ప్రచారం చేసే విధానాన్ని కాంగ్రెస్ నాయకులు మార్చుకోవాలని, లేకపోతే ప్రజాక్షేత్రంలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బుడిగం శ్రీను, బుర్రి వెంకట్, కూరాకుల బాలరాజు, దండా జ్యోతి రెడ్డి, పసుమర్తి రామ్మోహన్, తోట గోవిందమ్మ, శీలంశెట్టి రమ, ముక్కాల కమల, పగడాల శ్రీవిద్య, మాటేటి నాగేశ్వరరావు, బిక్కసాని జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.



# ఎస్.ఐ.ఆర్ మ్యాపింగ్ ప్రక్రియలో నిర్లక్ష్యం వహిస్తే వేతనాలు నిలిపివేస్తాం

**కలెక్టర్ ఇలా త్రిపాఠి**

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మే 08 (జర్నలిస్ట్ ఫైల్) : ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) సన్నాహక ప్రక్రియను ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో పక్కాగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పష్టం చేశారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో ఎస్.ఐ.ఆర్ మ్యాపింగ్ అమలు తీరుపై కలెక్టర్ గురువారం నగర పాలక సంస్థ సమావేశ మందిరంలో ఏ.ఈ.ఆర్.ఓలు,బీ.ఎల్.ఓ సూపర్వైజర్లతో సమీక్ష నిర్వహించారు. ఒక్కో పోలింగ్ కేంద్రం వారీగా ఎస్.ఐ.ఆర్ మ్యాపింగ్ అమలును పరిశీలిస్తూ,పనితీరులో వెనుకంజలో ఉన్న ఏ.ఈ.ఆర్.ఓలు,బీ.ఎల్.ఓ సూపర్వైజర్లను కారణాలు అడిగి తెలుసుకున్నారు. అర్బన్ లో మ్యాపింగ్ ప్రక్రియ మందకొడిగా సాగడం వల్ల నిజామాబాద్ జిల్లా సగటుపై ఇది ప్రభావం చూపుతోందని అన్నారు. ఎస్.ఐ.ఆర్ అమలులో స్పష్టమైన ప్రగతి సాధించాల్సిందేనని స్పష్టం చేశారు. ఒక్కో పోలింగ్ కేంద్రం వారీగా బీఎల్ఓలతో మ్యాపింగ్ ను పక్కాగా జరిపించాలని,రోజువారీగా నిశిత పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు. ఎస్.ఐ.ఆర్ సన్నాహక ప్రక్రియ అమలులో పురోగతిపై తాను వారం రోజుల తర్వాత మళ్ళీ సమీక్ష నిర్వహిస్తానని అన్నారు. స్పష్టమైన పురోగతి కనిపించాలని,ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే,వారి వేతనాలు నిలిపివేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పనితీరు సక్రమంగా లేని ఇద్దరు ఆర్.పీలకు షోకాజ్ నోటీసులు అందించి విధుల నుండి తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తన అనుమతి లేకుండా బీఎల్ఓల మార్పులు,చేర్పులు చేయకూడదని స్పష్టం చేశారు. ఓటరు జాబితాలో బోగస్ ఓటర్లు,చనిపోయిన వారు,శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్లు ఉండరాదని,అదే సమయంలో అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుండి తప్పిపోకూడదని అన్నారు. ఓటరు జాబితా పారదర్శకంగా ఉండాలనే ఉద్దేశంతోనే ప్రత్యేక సమగ్ర సవరణను ఎన్నికల సంఘం చేపట్టిందని అన్నారు. ఈ విషయాన్ని ప్రజలకు అవగాహన కల్పించేందుకు విస్తృత స్థాయిలో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాజకీయ పార్టీలు బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకునేలా చూడాలని,మ్యాపింగ్ ప్రక్రియ పురోగతి కోసం వారి సహకారం తీసుకోవాలని సూచించారు. ప్రత్యేక సమరణ ప్రక్రియ చేపట్టడం వల్ల ఓటరు జాబితాలో నిజమైన ఓటరు ఖచ్చితంగా ఉంటారని తెలిపారు. డూప్లికేట్ ఓటర్లతో పాటు మరణించిన,శాశ్వతంగా వలస వెళ్లిపోయిన,రెండు ఓట్లు ఉన్నవాళ్ల ఓట్లు మాత్రమే తొలగిస్తారని తెలిపారు. ఎవరూ అపోహకు గురి కావద్దని కలెక్టర్ సూచించారు. ప్రత్యేక సమగ్ర సవరణ తరువాత ఎవరైనా ఓటు హక్కు రాని వారు ఉంటే ఆక్షేపణ చేయవచ్చని అన్నారు. సమీక్షలో నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్,ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజ్,నిజామాబాద్ సౌత్ తహసీల్దార్ శ్రీధర్,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





## తెలంగాణ కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్,, వైస్ చైర్మన్ పరుచూరి మురళీలకి అభినందనల వెల్లువ..



శేరిలింగంపల్లి మే 08 (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ కమ్మ కార్పొరేషన్ చైర్మన్గా నియమితులైన కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ బండి రమేష్ ని, తెలంగాణ కమ్మ కార్పొరేషన్ వైస్ చైర్మన్గా నియమితులైన పరుచూరి మురళి ని కమ్మ సంఘం నాయకులు బొడ్డు రవిశంకర్ , గంగవరపు ప్రసాద్ , కలగర శ్రీను , కండెపనేని రత్నాకర్ , యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, చైర్మన్ శ్రీ యలమంచి ఉదయ్ కిరణ్ గారు, సుబ్బారావు , గాదె శివ చౌదరి , కొల్లి అనిల్, శ్రీమతి తులసి , శ్రీమతి ఇందిరా , చంద్రశేఖర్ , నరేష్ , సతీష్ , కామినేని శ్రీనివాసు , రత్నాచారి లు ఇతర సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. బండి రమేష్ , పరుచూరి మురళి సమాజ సేవా దృక్పథంతో ప్రజలకు మరింత చేరువై, తెలంగాణ కమ్మ సమాజ అభివృద్ధి సంక్షేమానికి విశేష సేవలు అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. గౌరవ సూచకంగా నాయకులను శాలువాలతో సన్మానించి, పుష్పగుచ్ఛాలు అందజేశారు. అదేవిధంగా అభివృద్ధి, పచ్చదనం, సామాజిక బాధ్యతకు ప్రతీకగా మొక్కలను బహుకరించి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఆత్మీయ వాతావరణంలో జరిగిన ఈ సమావేశంలో నాయకుల సేవా స్ఫూర్తి, ప్రజల పట్ల ఉన్న అంకితభావాన్ని సభ్యులు ప్రశంసించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి తెలంగాణ కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, పీసీసీ అధ్యక్షుడు శ్రీ మహేష్ కుమార్ గౌడ్ ల కి, మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు కి, ఏఐసీసీ కార్యదర్శి జెట్టి కుసుమ కుమార్ కి, రాజ్యసభ సభ్యులు రేణుకా చౌదరి కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే సమాజ అభ్యున్నతికి కట్టుబడి, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని పేర్కొన్నారు.



## మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

**యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్,ఎమ్మెల్యే పిలుపు**



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మే 08 (జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా టాస్క్ సౌజన్యంతో జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని శ్రీరామ గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. నిజామాబాద్,కామారెడ్డి లతో కూడిన ఉమ్మడి జిల్లా నుండి పెద్ద సంఖ్యలో యువత జాబ్ మేళాకు తరలివచ్చారు. 71 కంపెనీల ద్వారా సుమారు 2000 మందికి ఉద్యోగాలు కల్పించబడ్డాయని నిర్వాహకులు ప్రకటించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి,నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతి రెడ్డి తదితరులు విచ్చేసి,జాబ్ మేళాను లాంఛనంగా ప్రారంభించారు. వివిధ కంపెనీలలో ఉద్యోగాల కోసం ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ....నిరుద్యోగులకు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించడంలో భాగంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడుతోందని అన్నారు. సుమారు రెండు వేల మందికి నేరుగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారని,మరికొందరికి అప్రెంటిస్ షిప్ ద్వారా శిక్షణ కోసం ఎంపిక చేశారని అన్నారు. ఈ తరహా అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాట్లాడుతూ......దేశంలో ఎక్కడలేని విధంగా రాష్ట్రంలో నిరుద్యోగ అభ్యర్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు,నైపుణ్యాలను పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని అన్నారు. అందుకు గాను స్కిల్ యూనివర్సిటీని సైతం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నిజామాబాద్ లో ఇంత పెద్ద స్థాయిలో జాబ్ మేళా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇందులో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్,అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్,నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి,డివైఎస్ఓ పవన్ కుమార్,పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ సురేష్ కుమార్,ఎన్ఐసీ అధికారి మధు,ఈ-డీఎం కార్తీక్,వంశీధర్ రెడ్డి,టాస్క్ అధికారులు,ఆయా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు....



## బోనకల్ రైతు వేదికలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం

సౌర విద్యుత్‌తో రైతులకు ఆర్థిక లాభాలు -- అధికారులు అవగాహన



బోనకల్, మే 08 : బోనకల్ మండలంలోని బోనకల్ రైతు వేదికలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా "వ్యవసాయ క్షేత్రాలు -- సౌర విద్యుత్ కేంద్రాలు" అంశంపై అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రైతులకు సౌర విద్యుత్ వినియోగంపై అవగాహన కల్పిస్తూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అధికారులు వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మధిర ఆత్మ కమిటీ డైరెక్టర్ కందుల పాపారావు మాట్లాడుతూ, సోలార్ ప్రాజెక్టుల ద్వారా రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనాలు కలుగుతాయని తెలిపారు.



విద్యుత్ ఖర్చులు తగ్గడంతో పాటు రైతుల ఆదాయం పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఖమ్మం విద్యుత్ శాఖ ఎస్సీ ఇనుగుర్తి శ్రీనివాస చారి రైతులకు విద్యుత్ శాఖ అమలు చేస్తున్న పథకాలపై విపులంగా వివరించారు. సౌర విద్యుత్ వినియోగం, విద్యుత్ ఆదా, పర్యావరణ పరిరక్షణలో సోలార్ వ్యవస్థల ప్రాధాన్యతను వివరించారు. అలాగే గృహజ్యోతి, పీఎం కుసుమ్, పీఎం సూర్య ఘర్ వంటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా లభించే ప్రయోజనాలను రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీతానగరం సర్పంచ్ బిక్షయ్య, గోవిందాపురం సర్పంచ్ ఇస్రం కరుణ, బోనకల్ మండల వ్యవసాయ అధికారి వినయ్, విద్యుత్ శాఖ ఏడిఇ ఆనంద్ కుమార్, విద్యుత్ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. రైతులు కార్యక్రమంపై ఆసక్తి కనబరిచి పలు సందేహాలను అధికారులను అడిగి నివృత్తి చేసుకున్నారు.

## కొత్తూరు మున్సిపాలిటీ ప్రత్యేక అధికారిగా

సిడిఎంఏ జాయింట్ డైరెక్టర్ పి.శ్రీధర్..

నేటితో ముగిసిన పాలకవర్గం పదవీకాలం..రాష్ట్రంలో గ్రేటర్ వరంగల్, ఖమ్మం కార్పొరేషన్ తోపాటు నాలుగు మునిసిపాలిటీల్లో ప్రత్యేక అధికారుల పాలన





షాద్నగర్ నియోజకవర్గం మే 08 (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ రాష్ట్రంలో గ్రేటర్ వరంగల్, ఖమ్మం కార్పొరేషన్, సిద్దిపేట, అచ్చంపేట, జడ్చర్ల, నకిరేకల్, కొత్తూరు మున్సిపాలిటీల పాలకవర్గం పదవీకాలం నేటితో ముగిసింది. దీంతో కమిషనర్ అండ్ డైరెక్టర్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యదర్శి టీకే శ్రీదేవి (ఐఏఎస్) ప్రత్యేక అధికారులను నియమించింది. కొత్తూరు మున్సిపాలిటీకి సిడిఎంఏ జాయింట్ డైరెక్టర్ పి.శ్రీధర్ ను నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీటికి ఎన్నికలు జరిగే వరకు ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో ఈ మున్సిపాలిటీలు కొనసాగుతాయి.

## అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి జెకెసి ట్రస్ట్ చైర్మన్ ఆసరా




చింతూరు, మే 08 (జర్నలిస్ట్ ఫైల్) : చింతూరు గ్రామానికి చెందిన శెట్టి రమేష్ ఇల్లు ఇటీవల ప్రమాదవశాత్తు కూలిపోయింది. కట్టు బట్టలతో బాధితులు రోడ్డున పడ్డారు. ఈ విషయాన్ని గ్రామ పెద్దలు జెకెసి ట్రస్ట్ చైర్మన్ తెలుగుదేశం మండల అధ్యక్షులు మొహమ్మద్ జమాల్ ఖాన్ దృష్టికి తీసుకువెళ్లారు. శెట్టి రమేష్ బాధిత కుటుంబానికి జమాల్ ఖాన్ ఇంటి నిర్మాణానికి కావలసిన సిమెంట్ రేకులు ఇనుప పైపులను బాధిత కుటుంబానికి గురువారం నాడు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సభ్యులు పసుపులేటి సల్మాన్ రాజు,శీలం తమ్మయ్య,ట్రస్ట్ సభ్యులు అబ్రారుల్హక్ ,సిద్దిక్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ హోర్డింగ్ పై పిర్యాదు చేస్తే చంపేస్తామని బెదిరిస్తున్నారు

విజయ్ కుమార్ రెడ్డి



శేరిలింగంపల్లి (జర్నలిస్ట్ ఫైల్) : ట్విట్టర్ లో ఇల్లీగల్ హోర్డింగ్స్ పెడుతున్నారని పిర్యాదు చేస్తే చంపేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఎస్ఆర్ ప్రింటింగ్ ప్రెస్ చైర్మన్ విజయ్ కుమార్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేసాడు. ఈ సందర్భంగా గురువారం రోజు కొండాపూర్ డివిజన్ లోని రాఘవేంద్ర కాలనీలో తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విజయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మాదాపూర్ లో ఇల్లీగల్ హోర్డింగ్స్ ఉన్నాయని తాను ట్విట్టర్ లో పిర్యాదు చేసానన్నారు. శోభ రెడ్డి అనే మహిళ తనకు ఫోన్ చేసి, నా హోర్డింగ్స్‌పై ఎందుకు కంప్లైంట్ చేశావు" అంటూ బెదిరింపులకు పాల్పడిందనీ ఆరోపించారు. గతంలో తనపై లోకాయుక్తలో కూడా ఫిర్యాదు చేశానని ఆమె వాదించినట్లు చెప్పారు. సైబరాబాద్ మున్సిపల్ అధికారులకు ఇచ్చిన ఫిర్యాదు కాపీని ట్విట్టర్‌లో పోస్టు చేసిన తర్వాత, తనను బంజారాహిల్స్‌కు పిలిపించి బెదిరించారని ఆయన తెలిపారు.అక్కడ రాజు అనే వ్యక్తి "నీకు బతకాలనుందా లేదా" అంటూ హెచ్చరించాడని,తన వెనుక పెద్ద పెద్ద వ్యక్తులు ఉన్నారని రాజు బెదిరింపులకు దిగినట్లు పేర్కొన్నారు.ఇదే సమయంలో అక్కడికి వచ్చిన శోభ రెడ్డి, "ఈయనను వెంటనే కారులో ఎక్కించండి" అంటూ గట్టిగా మాట్లాడిందని, పరిస్థితి అనుమానాస్పదంగా మారడంతో తాను వెంటనే అక్కడి నుంచి కారులో వెళ్లిపోయినట్లు తెలిపారు. ఈ ఘటనపై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో తాము కూడా ఫిర్యాదు చేయగా ఆమెపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.అక్రమ హోర్డింగ్స్ వ్యవహారానికి రాజు అనే వ్యక్తే సూత్రధారి అని, తనకు కొంతమంది మంత్రుల అండదండలు ఉన్నాయని అతడు చెప్పుకున్నట్లు ఆరోపించారు. ఎమ్మెల్సీ బాల్మూరి వెంకట్ పేరు తాను ఎక్కడా ప్రస్తావించలేదని, కావాలనే కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విజయకుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గతంలో రాజ్ కుమార్, కిషోర్ తదితరులపై కేసులు పెట్టి ఒత్తిడికి గురి చేశారని కూడా ఆరోపించారు. ఇపుడు నన్ను చంపేస్తా అని బెదిరిస్తూ భయ భ్రాంతులకి గురి చేస్తూన్నారని ఈ విషమం పై అధికారులు స్పందించి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

# డిమాండ్ ఉన్న, లాభదాయకమైన పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలి

### జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

(జర్నలిస్ట్ ఫైల్) సంగారెడ్డి ప్రతినిధి, మే 08 : ప్రస్తుత మారుతున్న వ్యవసాయ పరిస్థితులకు అనుగుణంగా రైతులు డిమాండ్ ఉన్న, లాభదాయకమైన పంటలను సాగు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 4 నుంచి నిర్వహిస్తున్న రైతు వారోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లా కేంద్రం సమీపంలోని పోతిరెడ్డిపల్లి రైతు వేదికలో వ్యవసాయ, విద్యుత్, రెడ్‌కో శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు తమ భూములకు అనుకూలమైన పంటలను ఎంపిక చేసుకుని సాగు చేస్తే అధిక దిగుబడులతో పాటు మెరుగైన లాభాలు పొందవచ్చన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులు, మార్కెట్ అవసరాలు, కొత్త సాంకేతిక పరిజ్ఞానంపై రైతులు అవగాహన పెంపొందించుకుని పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయం చేయాలని సూచించారు.వ్యవసాయంలో పంటల సాగుతో పాటు విలువ ఆధారిత ఉత్పత్తులపై కూడా రైతులు దృష్టి పెట్టాలని చెప్పారు. వ్యవసాయంలో మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని, వాటిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా పీఎం కుసుమ్ కాంపోనెంట్ పథకం కింద సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకుని రైతులు నిరంతర ఆదాయం పొందేలా ముందుకు రావాలని సూచించారు. సహజ వనరులను సమర్థంగా వినియోగించుకునే దిశగా రైతులు అడుగులు వేయాలన్నారు.

అదేవిధంగా ఆయిల్ పామ్ సాగు మంచి లాభదాయకమైన పంట అని, భూమి, బోరు సౌకర్యం ఉంటే సరిపోతుందని తెలిపారు. ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం 90 శాతం వరకు సబ్సిడీ అందిస్తున్నందున రైతులు ఈ పంట సాగుపై దృష్టి సారించాలని కోరారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా పలు వ్యవసాయ పనిముట్లను ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. వ్యవసాయానికి సంబంధించి రైతులకు ఏమైనా సమస్యలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.ఈ సందర్భంగా కొంతమంది రైతులతో కలెక్టర్ ముఖాముఖి మాట్లాడారు. ఏ పంటలు సాగు చేస్తున్నారని, ఎన్ని ఎకరాలు ఉంది, బోరు సౌకర్యం ఉందా అని ఆరా తీశారు. ఐదు ఎకరాల్లో వరి సాగు చేస్తున్నట్లు రైతు తెలుపగా, లాభదాయకమైన ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు.జహీరాబాద్, సదాశివపేట, వట్‌పల్లి ప్రాంతాల్లో జొన్నల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కొందరు రైతులు కోరగా, ఆ దిశగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

అనంతరం రైతులకు సబ్సిడీపై అందజేస్తున్న డ్రోన్లు, కట్టర్లు, స్ప్రేయర్లు తదితర వ్యవసాయ యాంత్రీకరణ పరికరాల వినియోగంపై వ్యవసాయ శాఖ అధికారులు ప్రదర్శన నిర్వహించారు. విద్యుత్ శాఖ అధికారులు రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం తీసుకుంటున్న చర్యలు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్ల వద్ద పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. రెడ్‌కో, వ్యవసాయ శాఖ అధికారులు పీఎం కుసుమ్ కాంపోనెంట్ పథకం గురించి , ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్, రెడ్‌కో, వ్యవసాయ శాఖ అధికారులు, ఏవోలు, ఏఈవోలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పార్కు.. రోడ్డు .. తగ్గేదేలే.. దేన్నీ వదల్లే..

డ్రీమ్ ల్యాండ్ కాలనీలో పార్కు స్థలం కబ్జా..

33 ఫీట్ల రోడ్డు స్థలానికి ఎసరు..!

ఇదిగో ప్రైవేటు పాఠశాల మదర్ తెరిసా నిర్వాహకుల ఘనత.యథేచ్ఛగా మొదలైన నిర్మాణాలు..

హైడ్రాను సంప్రదించనున్న కాలనీవాసులు..

మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు..

నిర్మాణ పనులు నిలిపివేసిన కమిషనర్ సునీతారెడ్డి



షాద్నగర్ నియోజకవర్గం మే 08 (జర్నలిస్ట్ ఫైల్) : :కాలనీవాసులకు ఉపయోగపడే పార్కు స్థలం.. అయితేనేమి.. ప్రయాణికులకు ఉపయోగపడే రహదారి స్థలం.. అయినా సరే.. ఖాళీగా స్థలం కనిపిస్తే చాలు.. కబ్జా చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టున్నారు.. అడ్డంగా ఆక్రమించడమే కాకుండా నిర్మాణాలు కూడా మొదలుపెట్టారు.. దీనితో ఈ అడ్డగోలు ఆక్రమణను అడ్డుకునేందుకు కాలనీవాసులు యుద్ధం మొదలుపెట్టారు.. షాద్ నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో డ్రీమ్ ల్యాండ్ కాలనీ పార్కు స్థలం, అదేవిధంగా 33 ఫీట్ల ప్రభుత్వ రోడ్డు కబ్జా అయిన వైనం ఇది. ఇదే ప్రాంతంలో ఉండే మదర్ తెరిసా ప్రైవేటు పాఠశాల నిర్వాహకుల ఆక్రమణ పర్వం ఇది. పూర్తి వివరాల్లోకి వెళితే..

### ఇదీ దారుణం..

షాద్ నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో డ్రీమ్ ల్యాండ్ కాలనీ పార్కు ఉంది. ఇక్కడే మదర్ తెరిసా స్కూలు, మధ్యలో 33 ఫీట్ల రహదారి ఉన్నాయి. సర్వేనెంబర్ 167/పి లో ఉన్న రెండు పార్కు స్థలాలలో ఒకటి మదర్ తెరిసా స్కూల్ ముందు ఉంది. ఇక్కడ ఇటీవల నిర్మాణం ప్రారంభించారు. మున్సిపాలిటీకి సంబంధించిన స్థలంలో ఎవరు కూడా ఇక్కడ లేకపోవడంతో అసలు ఈ నిర్మాణం ఎవరు జరుపుతున్నారు అన్నదానిపై కాలనీవాసులు ఆరా తీశారు. దీనితో ప్రైవేటు పాఠశాల నిర్వాహకులే ఈ దారుణానికి పాల్పడుతున్నట్లు కాలనీవాసులకు అర్థమైంది. ఈ నిర్మాణాలు అడ్డుకోవాలని కోరినప్పటికీ నిర్వాహకులు యథావిధిగా వాటిని కొనసాగిస్తుండడంతో కాలనీవాసులు మోహన్ రెడ్డి, శిల్ప, నరసింహారెడ్డి, గడ్డం నరసింహారెడ్డి, భీమా నాయక్, శ్రీనివాస్, సురేందర్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, భాస్కర్ రెడ్డి షాద్ నగర్ మున్సిపాలిటీ కమిషనర్ సునీత రెడ్డికు ఫిర్యాదు చేశారు. దీనితో స్పందించిన మున్సిపల్ కమిషనర్ వెంటనే అక్కడ పనులు నిలిపివేశారు.

### ఫిర్యాదు ఇలా..

మున్సిపాలిటీలోని 6వ వార్డులో ఉన్న పార్కు స్థలాన్ని ఆక్రమించి అనధికార నిర్మాణం చేపట్టడంపై వెంటనే చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కమిషనర్ కు ఇచ్చిన ఫిర్యాదు పత్రంలో కోరారు. ప్రజల ఉపయోగం కోసం ఉన్న పార్కు, రహదారులు, లేఔట్ ప్లాన్ ఆధారంగా ఇక్కడ ప్లాట్లు కొనుగోలు చేశామని, కానీ పార్కు వెళితే సదరు మదర్ తెరిసా పాఠశాల నిర్వాహకులు దీనిని ఆక్రమిస్తున్న వ్యవహారం తమ దృష్టికి వచ్చి ఆందోళన కలిగిస్తుందని స్పష్టం చేశారు. అంతేకాకుండా ఆమోదించబడిన లేఅవుట్ సరిహద్దులను సరిగ్గా పాటించకుండా పార్కు చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం జరుగుతుందన్నారు. కాలనీకి చెందిన కాంగ్రెస్ నేత పి. శ్రీశైలం గౌడ్ ఇంటిముందు 12 అడుగుల మేరకు ఖాళీ స్థలం ఉందని, ప్రహరీ మాత్రం స్థలానికి అనుగుణంగా నిర్మించకపోవడం వల్ల అవకతవకలు ఉన్నట్లు తమకు అనుమానం ఉందని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో పది అడుగుల వెడల్పు గల గేటును ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు ఉన్నాయని, దీనివల్ల ఈ ప్రాంతంలో పార్కు స్థలం దుర్వినియోగం అయ్యే అవకాశం ఉందని అన్నారు. ఇక్కడ నియంత్రిత గేటును ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి పార్కు స్థలాన్ని కాపాడేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. పార్కు సరిహద్దులను లేఅవుట్ ప్రకారం నిర్ధారించుకోవాలని కోరారు. ప్రజా వినియోగ స్థలాన్ని పరిరక్షించి నివాసితుల హక్కులను కాపాడాలని కాలనీవాసులు కోరారు. హైడ్రా ను సంప్రదించనున్న కాలనీవాసులు తెలిపారు.దీనిపై తగిన చర్యలు తీసుకొని పార్కు స్థలాన్ని పరిరక్షిస్తామని మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి వెల్లడించారు..



## జనాభా గణనకు సహకరించండి,అభివృద్ధికి తోడ్పడండి

తాసిల్దార్ సయ్యద్ హుస్సేన్



చింతూరు, (జర్నలిస్ట్ ఫైల్) : జనాభా గణనకు సహకరించి దేశాభివృద్ధికి తోడ్పడాలని చింతూరు తహసిల్దార్ సయ్యద్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు.భారత ప్రభుత్వం వ్యాప్తంగా దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 2027 జనాభా గణన లో భాగంగా మొదటి విడత ఇండ్ల జాబితా తయారీ మే 1 నుండి మే 30 వరకు నిర్వహించబడుతోంది.ఈ సర్వే లో భాగంగా ప్రజలు ఇంటి యొక్క స్థితిగతుల వివరాల నమోదు జరుగును. తమ ఇంటికి వచ్చే గణన అధికారులకు మీ కుటుంబ వివరాలను ఖచ్చితంగా తెలియ చేయాలన్నారు. అందించే సమాచారం అత్యంత గోప్యంగా ఉంచబడుతుందని, ఇది ప్రభుత్వ సంక్షేమ పథకాల రూపకల్పనకు ఎంతో కీలకమన్నారు . జనాభా గణనలో అందించే వివరాల వల్ల కుటుంబాలకు అందుతున్న ప్రభుత్వ పథకాలకు ఎటువంటి ఇబ్బంది లేదన్నారు .మొదటిసారిగా డిజిటల్ పద్ధతిలో జరుగుతున్న ఈ జనగణనలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు . వివరాలు – దేశ ప్రగతికి మెట్లు, కావున ప్రభుత్వ అధికారులకు సహకరించాలని , వివరాలు ఇవ్వడం వల్ల దేశాభివృద్ధికి తోడ్పడి నట్లవుతుందని తాసిల్దార్ పేర్కొన్నారు.

## తెలంగాణలో బిజెపి అధికారంలోకి రావడం ఖాయం

నరేంద్రమోదీ గారి సభను విజయవంతం చేద్దాం

బిజెపి సీనియర్ నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి



షాద్నగర్ నియోజకవర్గం మే 08 (జర్నలిస్ట్ ఫైల్) : ఈ నెల 10 వ తేదీన హైదరాబాద్ పేరేడ్ గ్రౌండ్ లో నిర్వహిస్తున్న బహిరంగ సభ కు ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోడీ గారు వస్తున్న సందర్భంగా ఫరూఖ్ నగర్ మండలం కందివనం గ్రామంలో మండల అధ్యక్షులు పిట్టల సురేష్ ఆధ్వర్యంలో పోస్టర్ విడుదల కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి బిజెపి సీనియర్ నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి హాజరై పోస్టర్ విడుదల చేయడం జరిగింది.విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో తెలంగాణలో బిజెపి అధికారంలోకి రావడం ఖాయం అని అన్నారు.ఈ నెల 10 వ తేదీన ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ గారు హైదరాబాద్ పేరేడ్ గ్రౌండ్ లో నిర్వహించే బహిరంగ సభకు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేద్దాం అని అన్నారు.ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు సందీప్, అజయ్, ఆంజనేయులు, ప్రశాంత్, శివ, నవీన్, గణేష్, జశ్వంత్, తదితరులు పాల్గొన్నారు..

## పట్టుదల,క్రమశిక్షణ కలిగి ఉంటే ఉన్నత శిఖరాలను సులభంగా అధిగమించవచ్చు

టెన్త్,ఇంటర్మీడియట్ పరీక్షలలో మంచి మార్కులు సాధించిన జిల్లా పోలీసు అధికారులు,సిబ్బంది పిల్లలను అభినందించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



కొత్తగూడెం, మే 08 (జర్నలిస్ట్ ఫైల్) : ఇటీవల తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనపరిచి మంచి మార్కులు సాధించిన జిల్లా పోలీసు అధికారులు,సిబ్బంది పిల్లలను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు గురువారం జరిగిన కార్యక్రమంలో ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు గల కాన్ఫరెన్స్ హాల్ నందు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మొత్తం 63 మంది పోలీస్ సిబ్బంది పిల్లలు,వారి తల్లిదండ్రులు హాజరయ్యారు.ముందుగా మంచి మార్కులు సాధించిన విద్యార్థిని,విద్యార్థులు కొంతమంది తమ తల్లిదండ్రుల కష్టాన్ని,భవిష్యత్తులో తాము సాధించాలనుకుంటున్న లక్ష్యాలను వివరిస్తూ ఇలాంటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకుగాను ఎస్పీ కి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో అహర్నిశలు కష్టపడుతూ ప్రజలకు సేవలు అందిస్తూ తమ పిల్లల భవిష్యత్తు కోసం కష్టపడుతున్న తల్లిదండ్రులు కష్టాన్ని గుర్తించాలని పిల్లలకు సూచించారు. పట్టుదల,క్రమశిక్షణ,ఆత్మ స్థైర్యం ఉంటే ఎలాంటి కష్టమైన లక్ష్యాన్నైనా సులభంగా సాధించవచ్చని అన్నారు.జీవితంలో ఎల్లప్పుడూ పాఠాలను నేర్చుకుంటూనే ఉండాలని, ప్రతి రోజు ఏదో ఒక కొత్త విషయాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నిస్తూ ఉండాలని తెలిపారు.మంచి స్నేహితులను ఏర్పాటు చేసుకొని,దురలవాట్లకు దూరంగా ఉంటూ ప్రతి ఒక్కరూ ఉన్నత లక్ష్యాలకు చేరుకొని తమ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. పోలీస్ కుటుంబంలో పుట్టి పెరిగిన ఎస్పీ బాల్యం నుండి ఐపిఎస్ సాధించే వరకు తన గత స్మృతులను వారితో పంచుకున్నారు.అనంతరం మంచి మార్కులు సాధించి ఈ కార్యక్రమంలో పాల్గొన్న పోలీసులు కుటుంబంలోని విద్యార్థినీ,విద్యార్థులకు ఎస్పీ ప్రశంసా పత్రాలతో పాటు మెమెంటోలను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పీ సత్యనారాయణ, చుంచుపల్లి సిఐ వెంకటేశ్వర్లు,వన్టౌన్ సీఐ కరుణాకర్,త్రీటౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి,ఎంటిఓ సుధాకర్, హోంగార్డ్స్ ఇంచార్జ్ ఆర్ఐ నరసింహారావు,వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు,అడ్మిన్ ఆర్ఐ లాల్ బాబు,ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## సుడా చైర్మన్ గా పువ్వాళ్ళ నియామకం పట్ల కాంగ్రెస్ నాయకుల హర్షం



ఏన్కూర్, మే 08(జర్నలిస్ట్ ఫైల్):సుడా చైర్మన్ గా పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఏన్కూరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పువ్వాళ్ళ నియమకం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఏన్కూరు మండల కేంద్రంలోని మార్కెట్ కార్యాలయంలో మార్కెట్ కమిటీ చైర్మన్ లచ్చి రామ్ నాయక్ విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... పువ్వాళ్ళ నియామకం మంచి పరిణామం అని, రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో అందరికీ అన్ని వర్గాల నాయకులకు పదవులు వస్తాయని అనటానికి ఇంతకన్నా గొప్ప నిదర్శనం అని అన్నారు. రాజకీయాలలో కాకుండా, అభివృద్ధి రంగంలో కీలక మలుపు అవుతుందని సమస్యల పట్ల, ప్రజల పట్ల నిబద్ధత కలిగిన నాయకుడిగా ఆయన ఇప్పటికే ఎంతో పేరు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాను ముగ్గురు మంత్రులు అభివృద్ధి పథంలో నడిపిస్తూ, కాంగ్రెస్ పార్టీలోని ప్రతీ కార్యకర్తకు తగిన న్యాయం జరుగుతుందని అనటానికి ఇదొక నిదర్శనమని తెలిపారు. ఖమ్మం జిల్లా మరింత అభివృద్ధి పదంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. దుర్గాప్రసాద్ కు కాంగ్రెస్ పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో మేడ ధర్మారావు, ఓబీసీ మండల నాయకులు మొగిలి నాగరాజు, తాళ్లూరి నవీన్, లెనిన్, పంతగాని నరేష్, చిన్నస్వామి తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీలోకి భారీ చేరికలు



- మాజీ సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు కమలం కండువా

**విజయవాడ, (జర్నలిస్ట్ ఫైల్) :** రాజంపేట, సిద్ధవటం, కొత్తపల్లి తదితర ప్రాంతాలకు చెందిన పలువురు మాజీ సర్పంచ్‌లు, వార్డు సభ్యులు భారతీయ జనతా పార్టీలో చేరారు. చేపుర్తి వెంకటరెడ్డి నాయకత్వంలో జరిగిన ఈ చేరికల కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ వారికి కమలం కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని తెలిపారు. గ్రామీణ స్థాయిలో బీజేపీ బలోపేతానికి ఈ చేరికలు దోహదపడతాయని పేర్కొన్నారు. పార్టీలో చేరిన నాయకులు ప్రజాసేవకు కట్టుబడి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ ఎమ్మెల్యే సి ఆదినారాయణ రెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## లేబర్ అడ్డాలు ఏర్పాటుకు స్థల పరిశీలన



- కార్మిక శాఖ కమిషనర్ వెల్లడి

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు పట్టణంలో లేబర్ అడ్డాలు (ఇంటిగ్రేంటెడ్ లేబర్ ఆమెనిటీస్ కాంప్లెక్స్) ఏర్పాటు చేయుటకు అనువుగావున్న స్థలాలను రాష్ట్ర కార్మిక శాఖ కమిషనర్ గంధం చంద్రుడు, గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్ తో కలిసి

శుక్రవారం గుంటూరులో పరిశీలించారు. హిందూ కాలేజ్ జంక్షన్, కంకర గుట్ట ప్రాంతాలను తనిఖీ చేశారు. కార్మికులు పని కోసం రోడ్ల మీద వేచి ఉండకుండా... లేబర్ అడ్డాల్లో కూర్చొంటారని తెలిపారు. పని లేని సమయంలో కార్మికులకు స్కిల్ డెవలప్మెంటులో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. వివిధ ప్రాంతాల్లో పనులు నిమిత్తం ఒకచోట కార్మికులు వేచి ఉండే ఆచారం ఉందని, ఆయా పనులకు వెళ్ళగా మిగిలిన వారు ఆ ప్రాంతంలో ఖాళీగా ఉంటున్నారని చెప్పారు. ఇటువంటి వారిని గుర్తించి వారికి లేబర్ అడ్డాల్లో నైపుణ్య శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ అడ్డాల్లో తాగునీరు, మరుగుదొడ్లు సౌకర్యాలను కల్పించడం జరుగుతుందని అన్నారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో లేబర్ అడ్డాలు ఏర్పాటు చేయుటకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ ఉప కమిషనర్ ఏ గాయత్రీ దేవి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కిశోర బాలికలకు అవగాహన



**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ):** ఐసీడీఎస్ కాకుమాను మండలం తరుపున కాకుమాను సెక్టర్ సూపర్ వైజర్ వెంకాయమ్మ ఆధ్వర్యంలో రక్తహీనత గూర్చి అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ వెంకాయమ్మ మాట్లాడుతూ కిశోర వికాసం సమ్మర్ 2026 కార్యక్రమం లో భాగంగా కిశోర బాలికలకు అవగహన కార్యక్రమం నిర్వహిస్తూ బాలికలకు వైద్య సిబ్బంది చే ఆరోగ్య పరీక్షలు చేయించ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో అంగన్వాడీ సిబ్బంది వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

- అర్హులందరికీ సంక్షేమ ఫలాలు
- గుంటూరు తూర్పులో ప్రజా దర్బార్ నిర్వహణ
- అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించే అవకాశం ప్రజాదర్బార్ ద్వారా కలిగిందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ ఛైర్మన్ నసీర్ అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. జగన్ ప్రభుత్వంలో సెంటు స్థలం ఇచ్చామని పట్టా చేతిలో పెట్టారు.. కానీ స్థలం ఎక్కడ ఉందో చూపించ లేదని, రేషన్ కార్డులు, పింఛన్లపై ఎమ్మెల్యే నసీర్ కు అర్జీలు అందజేశారు. వివిధ సమస్యలపై అర్జీలు దాఖలు కాగా కొన్ని సమస్యలపై సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే నసీర్ ఫోన్ లో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన అర్జీలను సంబంధిత అధికారులకు పంపించి పరిష్కారానికి చర్యలు చేపడతామని అర్జీదారులకు హామీ ఇచ్చారు. త్వరలో గుంటూరు తూర్పు నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. ప్రతి అర్జీకి పరిష్కారం చూపుతామని భరోసా కల్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో కరెంటు బిల్లు ఎక్కువ వచ్చిందని, పెద్ద ఇల్లు ఉందని, ఇలా ఏవేవో కుంటిసాకులు చెప్పి పింఛన్లు, రేషన్ కార్డులకు ఎగనామం పెట్టారని తెలిపారు. దీంతో ప్రజాదర్బార్ లో ఎక్కువ శాతం పింఛన్లు, రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు వస్తున్నాయని పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం వెయ్యి రూపాయలు మాత్రమే పింఛన్ పెంచితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వెయ్యి రూపాయలు పెంచామని తెలిపారు. రాష్ట్రంలో అన్న క్యాంటీన్ల ద్వారా ఐదు రూపాయలకే కడుపు నిండా ఆహారం పెట్టే గొప్ప పథకానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. అగ్గిపెట్టెలులాంటి సెంటు భూమి ఇచ్చి నిరుపేదల జీవితాలతో ఆడుకున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. సూపర్ సిక్స్ ను సూపర్ హిట్ చేసి ప్రజలతో శభాష్ అనిపించుకున్నారని వివరించారు.

## మంత్రి నారా లోకేష్ సహకారంతో నూర్ మసీద్‌లో నూతన లిఫ్ట్ ప్రారంభం

- చంద్రబాబు, లోకేష్‌లకు అల్లాహ్ సంపూర్ణ ఆరోగ్యం ప్రసాదించాలి : ఎంఎం షరీఫ్



**మంగళగిరి,(జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి ఆర్టీసీ డిపో సమీపంలోని పావురాల కాలనీలో ఉన్న నూర్ మసీద్‌లో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ సొంత నిధులతో రూ. 5 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన నూతన లిఫ్ట్‌ను శుక్రవారం రాష్ట్ర మైనారిటీ వ్యవహారాల సలహాదారులు హాజీ ఎంఎం షరీఫ్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎంఎం షరీఫ్ మాట్లాడుతూ మసీదు వ్యవస్థాపకులు షేక్ మహమ్మద్ అలీ మూడు అంతస్తుల మసీదు నిర్మించి ప్రార్థనలు, ఖురాన్ విద్యాభ్యాసం కోసం అద్భుతమైన వసతులు కల్పించడం అభినందనీయమన్నారు. మంత్రి నారా లోకేష్ అందించిన ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన లిఫ్ట్ వృద్ధులు, చిన్నారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. మైనార్టీల మత విశ్వాసాలను గౌరవిస్తూ మంత్రి నారా లోకేష్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. వారికి అల్లాహ్ సంపూర్ణ ఆరోగ్యం, శక్తి సామర్థ్యాలు ప్రసాదించాలని ప్రార్థించారు. టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ మంత్రి లోకేష్ మసీదు నిర్మాణానికి రూ. 1 లక్ష, అనంతరం లిఫ్ట్ ఏర్పాటుకు మరో రూ. 5 లక్షలు అందించారని తెలిపారు. అన్ని మతాలను సమానంగా గౌరవించే లౌకిక పార్టీగా టీడీపీ ఎప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎండీ ఇబ్రహీం, సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారథి, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మున్నంగి శివ శేషగిరిరావు, టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ నిజాముద్దీన్, టీడీపీ నాయకులు షేక్ రియాజ్, ఎండీ రఫీ, అమీర్, గల్ఫ్ సుభాని, భాషా, మసీదు కమిటీ వ్యవస్థాపకులు షేక్ మహమ్మద్ అలీ, గౌరవాధ్యక్షులు షేక్ ఖలీల్ బాయ్, షేక్ నాగుల్ మీరా, కార్యదర్శి షేక్ చిన్న నాగులు, సభ్యులు మహమ్మద్ జానీ, షౌకత్ అలీ, వలి తదితరులు పాల్గొన్నారు.

## నిడమర్రు రైల్వే ఓవర్ బ్రిడ్జి శంకుస్థాపన ఏర్పాట్లను పరిశీలన



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** నిడమర్రు రైల్వే ఓవర్ బ్రిడ్జి శంఖుస్థాపన కార్యక్రమానికి ఏ లోపాలు తలెత్తకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని గుంటూరు నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ ఆయా విభాగాల అధికారులకు స్పష్టం చేశారు. ఈ నెల 13న నిడమర్రు వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులకు కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న, కేంద్ర గ్రామీణాభివృద్ధి, సమాచార శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ లు శంఖుస్థాపన చేయనున్న నేపథ్యంలో శంఖుస్థాపన శిలాఫలకం, వేదిక ప్రాంతాన్ని రైల్వే, ఎంటిఎంసి, పోలీస్, రెవెన్యూ అధికారులతో పరిశీలించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శిలాఫలకం, సభావేదిక ఏర్పాట్లను రైల్వే అధికారులు భాధ్యత తీసుకొని నిర్దేశిత ప్రొటోకాల్ మార్గదర్శకాల మేరకు సిద్ధం చేయాలన్నారు. కేంద్ర మంత్రి పర్యటన మార్గం, సభావేదిక ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాలని ఎంటిఎంసి డిప్యూటీ కమిషనర్ ని ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రణాళికాబద్దంగా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పార్కింగ్ ఏర్పాటు చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను, సభకు హాజరయ్యే వారికి మొబైల్ టాయ్ లెట్స్ ఏర్పాటు చేయాలని, ట్రాక్ కి ఇరువైపులా ప్యాచ్ వర్క్ లు, పిచ్చి చెట్ల తొలగింపు చేపట్టాలని ఎంటిఎంసి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమ నిర్వహణకు విధులు కేటాయించబడిన ప్రతి అధికారి తమ సిబ్బందితో కార్యక్రమం పూర్తీ అయ్యే వరకు భాధ్యతగా ఉండాలని, ఏ విధమైన లోపాలు తలెత్తడానికి వీలు లేదని స్పష్టం చేశారు. ఆయా విభాగాల అధికారులు ముందుగానే కార్యకమ ప్రదేశానికి వెళ్లి పరిశీలించుకోవాలన్నారు. పర్యటనలో ఎంటిఎంసి డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, డిసిపీ అశోక్ కుమార్, రైల్వే అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రసాదరావు, డిఎస్పీ మురళీకృష్ణ, రూరల్ సిఐ వెంకట బ్రహ్మం, తహాశీల్దారు రాఘవేంద్ర, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# కాకుమాను మండల విద్యాశాఖ విస్తృత ప్రచారం



**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ):** ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు ప్రక్రియలో భాగంగా ఉపాధ్యాయులు మరియు విద్యాశాఖ అధికారులు మండల సిబ్బంది ద్వారా విస్తృతంగా జరుగుతున్న ప్రచారం.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రధానంగా అమలు చేస్తున్న ఒక విద్యా కార్యక్రమం. నిర్దిష్ట అభ్యసన ప్రమాణాలను చేరుకోవడానికి 1–5 తరగతుల విద్యార్థులలో ప్రాథమిక పఠన, రచన మరియు గణిత నైపుణ్యాలను మెరుగుపరచడమే లక్ష్యంగా గ్యారంటీడ్ ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ ప్రభుత్వ ప్రవేశపెట్టి విద్యార్థులలో దాగి ఉన్న సామర్థ్యాలను పెంపొందించడానికి ప్రభుత్వం అనేక నైపుణ్యాల కొరకు సహకరించే పరికరాలతో వినూత్న కార్యక్రమాలతో పిల్లల విద్య అభివృద్ధికి దోహదపడే అభ్యాసన పరికరాలతో ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయాలని దృఢ సంకల్పంతో ముందుకు సాగుతుంది. దానిలో భాగంగా రాష్ట్ర స్థాయి ఉన్నత విద్యాశాఖ అధికారులు మొదలుకొని మండల స్థాయి ఉన్నత అధికారులు మండల స్థాయి విద్య శాఖ సిబ్బంది అందరూ కలిసి పాఠశాలలో నమోదు సంఖ్య పెంపొందించుటకు గాను ప్రచార నిమిత్తం ఊరు ఊరు వీధి వీధి గాలిస్తూ నూతన నమోదు కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా కాకుమాను మండలం విద్యా శాఖ అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు అయిన తల్లిదండ్రులకు ఆర్థిక భరోసా కొరకు తల్లికి వందనం ద్వారా ప్రతి పిల్లవాడికి 15000 ప్రభుత్వం అందిస్తుందన్నారు.

విద్యార్థుల ప్రాథమిక అవసరాలైన 3 జతలు యూనిఫాము, బెల్టు, బ్యాగు, బూట్లు వాటి పుస్తకాలు నోట్ బుక్స్ అందిస్తుందన్నారు. మధ్యాహ్న భోజనం ప్రతిరోజు వేరువేరు పౌష్టిక ఆహార పదార్థాలతో కూడిన ప్రణాళిక అందిస్తున్నరన్నారు. వ్యక్తిగత నైపుణ్యాలు పెంపొందించడానికి వీడియో పాఠాలు, ఇంటరాక్టివ్ క్విజ్‌లు, ప్రభుత్వ విద్యా డిజిటల్ ప్లాట్‌ఫాం, తెలుగు మరియు ఇంగ్లీష్‌లో పాఠాలు, ఉచిత నోట్స్, వీడియోలు, టీవీ ఛానెల్స్ ద్వారా పాఠాలు, ఇంటర్నెట్ లేకున్నా చదువు అవకాశం, ప్రభుత్వ పాఠశాలల కోసం ప్రత్యేక మెటీరియల్ లైబ్రరీ డ రీడింగ్ కార్యక్రమాలు రోజుకు 30 నిమిషాల పఠనం, కథలు, సైన్స్ పుస్తకాలు చదవడం కథల ద్వారా అభ్యాసం, ఆటల ద్వారా గణితం సంఖ్యల ఆటలు, పట్టికలు పాటల రూపంలో, గడియారం, డబ్బు లెక్కలు నేర్పడం జరుగుతుందన్నారు. తెలుగు డ ఇంగ్లీష్ పఠనం రోజుకు 15--20 నిమిషాలు చదవించడం, అక్షరాలు, పదాలు, చిన్న వాక్యాలు, స్పష్టంగా చదివే అలవాటు, చిత్రలేఖనం & క్రాఫ్ట్స్ రంగులు వేయడం, కాగితంతో ఆకారాలు తయారు చేయడం, సృజనాత్మకత పెరుగుతుందన్నారు.

పాటలు & పద్యాలు, బాలల గేయాలు,, డిజిటల్ లెర్నింగ్, యానిమేషన్ వీడియోలు, తెలుగు రైమ్స్, సరదా క్విజ్‌లు ప్రకృతి పరిచయం మొక్కలు, జంతువులు చూపించడం, చిన్న తోట పనులు చేయించడం, పర్యావరణ అవగాహన పెరుగుతుందన్నారు. మంచి అలవాట్లు, సమయ పాలన, వ్యక్తిగత ప్రవర్తన పై ప్రత్యేక దృష్టి అనేక శుభ్రత కార్యక్రమాలను పరిచయం చేయటం. యోగా & చిన్న వ్యాయామాలు, ఏకాగ్రత ప్రత్యేక దృష్టి ,ఆరోగ్యం ఆహార నియమాలు మాట్లాడే కార్యక్రమాలు "ఈ రోజు నేర్చుకున్నది" చెప్పించడం స్టేజ్ ఫియర్ స్టేజ్ ఫెయిర్ లేకుండా చేయడం జరుగుతుందన్నారు. దేశభక్తి పాటలు అనేకమైన నూతన కార్యక్రమాల ద్వారా ప్రచారం చేస్తున్నటువంటి విద్యాశాఖ అధికారులు ప్రజలకు ఇంటింటికి వెళ్తు తెలియజేస్తున్నారు.

## గుంటూరు నగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్ పనితీరుపై ఎమ్మెల్యే గళ్ళా మాధవి సీరియస్ రివ్యూ

- అనవసరంగా ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే సహించం
- టౌన్ ప్లానింగ్ విభాగం గురించి అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి, సరిదిద్దుకోండి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో టౌన్ ప్లానింగ్ విభాగం పనితీరుపై ఇటీవల అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి, వాటిని వెంటనే సరిదిద్దుకోండి అని, అనవసరంగా ప్రజలను నిబంధనల పేరుతో ఇబ్బంది కలిగిస్తే సహించమని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి హెచ్చరించారు. శుక్రవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ నగర అభివృద్ధిలో టౌన్ ప్లానింగ్ శాఖ బాధ్యత చాలా కీలకమని, మంచి పనులు చేస్తే ప్రజల నుంచి ప్రశంసలు వస్తాయని, ఇదే అంశాన్ని ముఖ్యమంత్రి కార్యాలయం సైతం ధృవీకరించిందని, అన్నిటిలో బెస్ట్ గా గుంటూరు వెస్ట్ టౌన్ ప్లానింగ్, శానిటేషన్ విభాగాల పని తీరు దారుణంగా ఉందని రిపోర్ట్ ఇచ్చారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. తప్పులు జరిగితే విమర్శలు కూడా సహజమని అన్నారు. అందుకే మీడియాలో వచ్చిన ప్రతి వార్తను అధికారులు బాధ్యతగా తీసుకుని పనితీరును మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు.

టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా పనిచేయాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి సూచించారు. ప్రజలను అనవసరంగా ఇబ్బందులకు గురి చేయొద్దని, ఫైళ్లు పెండింగ్‌లో పెట్టి వేధించే పరిస్థితులు ఉండకూడదన్నారు. "మీరు నిజాయితీగా పని చేస్తే మీకు పూర్తి సహకారం ఉంటుంది. నిబంధనల ప్రకారం పనిచేసే అధికారులపై ఎటువంటి రాజకీయ ఒత్తిడులు ఉండవు" అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు.

ప్రజలకు వేగంగా, పారదర్శకంగా సేవలు అందించడంతో పాటు నగర అభివృద్ధికి ఆటంకం కలిగించే అక్రమాలపై కఠినంగా వ్యవహరించాలని అధికారులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి సూచించారు.

## తాగునీరు, మురుగు కాలువల సమస్యలు లేకుండా చూడండి

- అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి
- గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ప్రజా గ్రీవెన్స్ నిర్వహణ

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు పశ్చిమ నియోజకవర్గములో ఉన్న చిన్న, సన్నగల్లీలో కూడా తాగునీరు, మురుగు కాలువల సమస్యలు లేకుండా చూడాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి, అధికారులకు సూచించారు. శుక్రవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రజల నుండి అర్జీలు స్వీకరించి, సమస్యలను విని వెంటనే స్పందించారు. పింఛన్లు, రేషన్ కార్డులు, తాగునీరు, మురుగు కాలువలు, రోడ్ల నిర్మాణం వంటి పలు సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.

భారత్‌పేటకు చెందిన పొందూరు అనురాధ తనకు ఒంటరి మహిళ పింఛన్ మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరగా, సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. అలాగే వడ్లమూడి వెంకట నారాయణ తనకు తెల్ల రేషన్ కార్డు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేయగా, అర్హత మేరకు సహాయం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

42వ డివిజన్‌కు చెందిన జే. వెంకటేశ్వరావు వికలాంగుల పింఛన్ మంజూరు చేయాలని కోరగా, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి హామీ ఇచ్చారు.

ఇదే సందర్భంగా గుజ్జనగుండ్ల మసీదు ఆర్చి రోడ్డు ప్రాంత ప్రజలు తమ కాలనీలో మంచి నీటి పైప్‌లైన్, మురుగు కాలువ మరియు సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విన్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మరియు గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి చేపడుతున్న ప్రజా సేవా కార్యక్రమాలకు ఆకర్షితులై పలువురు యువకులు ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బెజ్జం అనిల్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే గళ్ళా మాధవి పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

## ఎన్.సి.సి శిబిరం పోరాట స్ఫూర్తిని అందిస్తుంది - ఈగల్ టీమ్ సిఐ విక్టర్




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):** ఎన్.సి.సి శిక్షణ శిబిరాలు విద్యార్థులలో పోటీ తత్వాన్ని, పోరాట స్ఫూర్తిని పెంపొందించి, వారు ఉత్తమ పౌరులుగా ఎదిగేందుకు దోహదపడతాయని ఈగల్ టీమ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సి.ఐ.) విక్టర్ అన్నారు. వివిఐటి విశ్వవిద్యాలయంలో జరుగుతున్న ఎన్.సి.సి 2(ఏ) బెటాలియన్ వార్షిక శిక్షణ శిబిరంలో భాగంగా మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తలుగా ఈగల్ టీమ్ సి.ఐ. విక్టర్, ఎస్.ఐ. సునీల్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.ఐ. విక్టర్ మాట్లాడుతూ యువతను, విద్యార్థులను మాదకద్రవ్యాల మహమ్మారి నుండి కాపాడటం మరియు డ్రగ్స్ రవాణాను నిర్మూలించడమే ఈగల్ టీమ్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడటం ద్వారా వ్యక్తిగత ఎదుగుదల ఆగిపోతుందని, అది జీవిత ఉన్నతికి పెద్ద ఆటంకంగా మారుతుందని హెచ్చరించారు.

అనంతరం ఎస్.ఐ. సునీల్ కుమార్ మాట్లాడుతూ.. డ్రగ్స్‌కు బానిసలవ్వడం వల్ల సమాజంలో గౌరవం కోల్పోవడమే కాకుండా, నేర ప్రవృత్తి పెరిగి భవిష్యత్తు అంధకారమవుతుందని అన్నారు. డ్రగ్స్ లేదా గంజాయి కి సంభందించిన సమాచారం ఉంటే వెంటనే ఈగల్ టీం కాల్ సెంటర్ 1972కు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఈగల్ టీమ్ సభ్యులు, ఎన్.సి.సి అధికారులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## సమాధన్ సమరో సుప్రీం కోర్టులో ప్రత్యేక లోక్ అదాలత్ సమాధన్

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** సమరో 2026 లో భాగంగా సుప్రీం కోర్టులో ఆగష్టు 21,22,23 తేదీలలో ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు బి. సాయి కళ్యాణ్ చక్రవర్తి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ లోక్ అదాలత్ సుప్రీం కోర్టులోనే నిర్వహించడం జరుగుతుందని అన్నారు. సుప్రీం కోర్టులో పెండింగ్ లో ఉన్న కేసులు లోక్ అదాలత్ లో సెటిల్ చేసుకోవాలని తెలిపారు. పెండింలో ఉన్న కేసులు ప్రమాదాలకు సంబంధించి క్లయింలు, చెక్ బౌన్స్ కేసులు, భూ సేకరణ సమస్యలు లోక్ అదాలత్ లో సెటిల్ చేసుకోవచ్చని తెలిపారు. లోక్ అదాలత్ ఫారాలు, సుప్రీం కోర్టు వెబ్ సైట్లోను, జిల్లా కోర్టు వెబ్ సైట్ లోను అందుబాటులో ఉంచామన్నారు. ఫిర్యాదు దారులు, కక్షిదారులు సుప్రీం కోర్టు అంగికారంతో వారి న్యాయవాదులతో జిల్లాలోనే హాజరు కావచ్చునని పేర్కొన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నిర్వహించే సెటిల్మెంట్ సమావేశాలకు ప్రత్యక్షంగా లేదా వర్చువల్ గా హాజరు కావొచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు టోల్ ఫ్రీ నంబరు, 15100, 0863-222448 లను సంప్రదించవచ్చునని తెలిపారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## రూ. 60 లక్షలతో నిర్మించిన మెటల్ రోడ్డును ప్రారంభించిన ఎంపీ లావు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని గౌరవ నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు శ్రీ లావు శ్రీకృష్ణదేవరాయలు గారు అన్నారు. నరసరావుపేట మండలం కేసానుపల్లి గ్రామం నుండి వయా మల్లాయపాలెం మీదుగా సాతులూరు వరకు రూ. 60 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన మెటల్ రోడ్డును శుక్రవారం స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తో కలిసి ఎంపీ లావు శుక్రవారం ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. దశాబ్దాలుగా ప్రజలు ఎదుర్కొంటున్న ప్రయాణ కష్టాలను తీరుస్తూ, మెరుగైన రవాణా సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు. ఈ రోడ్డు మార్గం ద్వారా పరిసర గ్రామాల మధ్య అనుసంధానత పెరగడమే కాకుండా, ముఖ్యంగా రైతన్నలు తమ ఉత్పత్తులను తరలించడానికి ఎంతో సులభతరం వుతుందని తెలిపారు. ఇదే విధంగా నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతంలో మౌలిక సదుపాయాల కల్పనకు కట్టుబడి ఉన్నామని, రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతామని ఎంపీ స్పష్టం చేశారు.

## శ్యామల నగర్ రైల్వే గేట్ వద్ద ఆర్ఓబి నిర్మాణానికి చర్యలు



- నగర కమిషనర్ మయూర్ అశోక్ వెల్లడి

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో(జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా, స్థానిక భవన యజమానులకు సమస్యలు లేకుండా శ్యామలా నగర్ రైల్వే గేటు దగ్గర ఆర్.ఓ.బీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని గుంటూరు నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. శుక్రవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో శ్యామల నగర్ రైల్వే గేటు పరిసర ప్రాంత భవనాల యజమానులు, రైల్వే, జిఎంసి అధికారులతో సంయుక్త సమావేశం జరిగింది.
ఈ సందర్భంగా తొలుత రైల్వే అధికారుల ప్రతిపాదనలు, వారు చేసిన ట్రాఫిక్ సర్వే అంశాలను వివరించి, అనంతరం హాజరైన స్థానికుల అభిప్రాయాలను తెలుసుకొని, కమిషనర్ మాట్లాడుతూ ఆర్ఓబీ లేదా ఆర్యూబీలు ఏదైనా గుంటూరు నగరంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారం చేయడానికేనని, అందరికీ ఆమోదయోగ్యమైన నిర్మాణం చేయడానికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకుంటాయని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న అంశాలను, ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని, రైల్వే ఇంజినీరింగ్, జిఎంసి పట్టణ ప్రణాళిక అధికారులు త్వరలో సంయుక్త క్షేత్ర స్థాయి పరిశీలన చేయాలన్నారు. అనంతరం తాము కూడా పరిశీలించి, వారం రోజుల్లో మరొక సమావేశం నిర్వహించి, ఆర్ఓబీ లేదా ఆర్యూబీ అనే అంశంపై నిర్ణయానికి వద్దామని తెలిపారు. సమావేశంలో రైల్వే డిప్యూటీ సిఈ నాయుడు, జిఎంసి సిటి ప్లానర్ రాంబాబు, డిసిపీ సూరజ్ కుమార్, ఏసిపీ రెహ్మాన్, శ్యామల నగర్ రైల్వే గేటు పరిసర ప్రాంత భవన యజమానులు పాల్గొన్నారు.

## ప్రతి సమస్యకు స్పష్టమైన విధానంతో పరిష్కారం : ఎమ్మెల్సీ ఆలపాటి



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** ప్రజా సమస్యల పరిష్కార దిశగా రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం గ్రీవెన్స్ నిర్వహించి, వచ్చిన సమస్యల పరిష్కారానికి స్పష్టమైన విధానంతో,కృషి చేస్తున్నామని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక రామలింగేశ్వర పేటలోని, నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అర్జీదారుల నుండి అర్జీలు స్వీకరించి సమస్యలు తెలుసుకున్నారు. నిర్ణీత గడువులో సమస్యలు పూర్తి అయ్యేలా అర్జీదారులకు భరోసా కల్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో, ప్రజలు ఎటువంటి సమస్యలతో ఇబ్బంది పడరాదని,గత కొన్ని నెలలుగా,రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం, గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వచ్చిన అర్జీల లోని సమస్యలను, అధికారుల ద్వారా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు, మహమ్మద్ కుద్దూస్, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నాదుల మహేష్, గిడ్డంగుల కమిటీ డైరెక్టర్ కేసన కోటేశ్వరరావు, తదితర పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## హై కోర్టు జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ పదవీ విరమణ వీడ్కోలు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : హై కోర్టు న్యాయమూర్తి గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ కు హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ ఆధ్వర్యంలో ఫుల్ బెంచ్ ఘన వీడ్కోలు పలికారు. హైకోర్టు న్యాయమూర్తి గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ పదవీ విరమణ చేయనున్న సందర్భాన్ని పురస్కరించుకుని వీడ్కోలు కార్యక్రమం హై కోర్టు మొదటి కోర్టు హాల్ లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ మాట్లాడుతూ జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ నిబద్ధత కలిగిన జడ్జి అని కొనియాడారు. జస్టిస్ జి.రామకృష్ణ ప్రసాద్ ప్రకాశం జిల్లాలోని కారంచేడులో జి.గాంధీ చౌదరి,విజయలక్ష్మీ దంపతులకు మే 28, 1964లో జన్మించారని, ప్రాథమిక విద్యాభ్యాసంను కారంచేడులో ఆపై గుంటూరులోని లొయోలా పబ్లిక్ స్కూల్లో పూర్తి చేసి, గుంటూరులోని ఏసీ కాలేజీలో ఎల్ ఎల్ బి పూర్తి చేసి 1991లో బార్ కౌన్సిల్ లో సభ్యత్వం తీసుకున్నారని తెలిపారు. గుంటూరులోని న్యాయ కళాశాలలో న్యాయశాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తూ సుప్రింకోర్టులో ప్రాక్టీస్ ప్రారంభించారని తెలిపారు. ఫిబ్రవరి 14, 2022న ఏపీ హై కోర్టు న్యాయమూర్తిగా నియామకం అయ్యారన్నారు.
అనంతరం అడిషినల్ సోలిసిటర్ జనరల్ చల్లా ధనుంజయ్, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్,ఏపీ హైకోర్టు బార్ అసోసియేషన్ ప్రసిడెంట్ ప్రభునాథ్,బార్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ ఛైర్మన్ ధ్వారకానాథ్ రెడ్డిలు జస్టిస్ జి.రామృష్ణ ప్రసాద్ కు పదవీ విరమణ శుభాకాంక్షలు తెలుపుతూ తమ అనుభవాలను పంచుకున్నారు. అనంతరం జస్టిస్ జి.రామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగ నిర్వహణలో సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. తన విద్యార్థి దశ నుండి న్యాయవాదిగా, న్యాయమూర్తిగా ఉన్నత శిఖరాలను చేరుకోవడానికి ప్రతి దశలోనూ ఉత్తమ సలహాలు అందించిన పెద్దలకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు,అడిషినల్ అడ్వకేట్ జనరల్, పబ్లిక్ ప్రాసిక్యూటర్, పలువురు న్యాయవాదులు జస్టిస్ జి. రామకృష్ణ పసాద్ కు అభినందనలు తెలిపారు.

## చర్చలు విఫలం - మే 15 సమగ్ర శిక్షా ఉద్యోగుల మహా పాదయాత్ర యథాతథం



**విజయవాడ, (జర్నలిస్ట్ ఫైల్)** : సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై జేఏసీ రాష్ట్ర నాయకత్వంతో రాష్ట్ర అధికారులు గురువారం ఆన్‌లైన్ ద్వారా చర్చలు నిర్వహించారు. ఈ సందర్భంగా మే 15న చేపట్టనున్న మహా పాదయాత్రను వాయిదా వేసుకోవాలని అధికారులు కోరినా, ప్రధాన డిమాండ్లపై స్పష్టమైన హామీ లేకపోవడంతో చర్చలు విఫలమయ్యాయి.
జేఏసీ రాష్ట్ర కమిటీ వెల్లడించిన వివరాల ప్రకారం రెగ్యులరైజేషన్, హెచ్ఆర్ పాలసీ అమలు, ఎంటీఎస్, వేతనాల పెంపు వంటి కీలక అంశాలపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన నిర్ణయం రాకపోవడంతో మే 15న విజయవాడ నుంచి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నివాసం వరకు కుటుంబ సభ్యులతో కలిసి నిర్వహించనున్న మహా పాదయాత్రలో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేశారు.
పాదయాత్ర సందర్భంగా లేవనెత్తిన సమస్యల పరిష్కారం కోసం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్వయంగా చొరవ తీసుకుని సమగ్ర శిక్షా ఉద్యోగులకు న్యాయం చేయాలని జేఏసీ నాయకులు విజ్ఞప్తి చేశారు.
అలాగే ఇటీవల కేజీబీవీ ఉపాధ్యాయుల బదిలీలను అసంబద్ధంగా నిర్వహించారని ఆరోపిస్తూ, వాటిని వెంటనే రద్దు చేసి స్పష్టమైన, పారదర్శక నిబంధనల ప్రకారం బదిలీలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.
ప్రభుత్వం తరఫున జరిగిన చర్చల్లో సమగ్ర శిక్షా అడిషనల్ ఎస్పీడీ రవీంద్రనాథ్ రెడ్డి, కేజీబీవీ సెక్రటరీ దేవానంద రెడ్డి పాల్గొన్నారు.
జేఏసీ తరఫున గౌరవ అధ్యక్షుడు ఏవి నాగేశ్వరరావు, రాష్ట్ర చైర్మన్ కాంతారావు నాని, సెక్రటరీ జనరల్ కళ్యాణి, ఆర్గనైజేషన్ సెక్రటరీ జాన్ మోడీ, వైస్ చైర్మన్ వాసా శ్రీనివాసరావు, కో-చైర్మన్లు రఫీ, ఓబులరెడ్డి, శ్రీరాములు, రామన్న, కేజీబీవీ టీచర్స్ ఫెడరేషన్ గౌరవ అధ్యక్షురాలు విజయ గౌరీ, అధ్యక్షురాలు శ్రీరేఖ, ప్రధాన కార్యదర్శి తేజస్విని, రమాదేవి, కేజీబీవీ టీచర్స్ యూనియన్ నాయకురాలు రత్నమాలిని, సిఆర్ఎం టీచర్స్ ప్రోగ్రెసివ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్, రాష్ట్ర కమిటీ సభ్యుడు గంగాధర్, సెట్ ఇంజనీర్స్ యూనియన్ రాష్ట్ర నాయకుడు పి. గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

## మండల విద్యాశాఖ అధికారికి నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ఘన సత్కారం



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి నూతన మండల విద్యాశాఖ అధికారిగా నియమితులైన సి. హెచ్. లక్ష్మణరావును నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పూలగుత్తి అందజేసి, శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

**జీతాలు సకాలంలో అందిస్తామని హామీ**

ఈ సందర్భంగా నూతన మండల విద్యాశాఖ అధికారి లక్ష్మణరావు మాట్లాడుతూ, గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని ఉపాధ్యాయులకు జీతాలు ప్రతి నెలా ఒకటవ తేదీన సక్రమంగా అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎటువంటి బిల్లులు పెండింగ్‌లో ఉండకుండా సత్వర చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు.

**సర్వీస్ రిజిస్టర్ల నవీకరణపై విజ్ఞప్తి**

గుంటూరు నగరపాలక సంస్థ పశ్చిమ పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సేవా నమోదు పత్రాలు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు మండల విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లారు. వాటిని త్వరితగతిన నవీకరించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన అధికారి, సమావేశంలో ఈ అంశానికి ప్రాధాన్యం ఇస్తామని నిర్ధారించారు. ఈ కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. హైమారావు, గుంటూరు జిల్లా అధ్యక్షుడు పి. సాయి విశ్వనాథ్, రాష్ట్ర కార్యదర్శి షేక్ అబ్దుల్ ఖలీల్, రాష్ట్ర నగరపాలక సంఘ నిర్వాహకుడు పి. లలితాబాబు, నగర అనుబంధ అధ్యక్షుడు వేణుగోపాల్, అధ్యక్షుడు కె.వి. రాఘవులు, ప్రధాన కార్యదర్శి టి. శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు టి. రవి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో 216 అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీ జాబితా

- శనివారంనాడు జూమ్ కౌన్సెలింగ్
- వెనువెంటనే పోస్టింగ్ ఉత్తర్వులు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో 216 అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీకి ఎంపిక చేసిన అభ్యర్థుల జాబితాను వైద్యారోగ్య శాఖ విడుదల చేసింది. వీరికి శనివారంనాడు పోస్టింగ్‌ల కేటాయింపు కోసం జూమ్ ద్వారా కౌన్సిలింగ్ జరగబోతుంది. జీరో వేకెన్సీ పాలసీలో భాగంగా పోస్టుల భర్తీని ఎప్పటికప్పుడు చేపడుతున్నామని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ నేడొక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగానే 216 అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీని త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు. ఈ ఏడాది జనవరిలో ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్మెంట్ బోర్డు (ఏపిఎంఎస్ఆర్‌బి) డిఎంఇ పరిధిలోని బోధానుసుపత్రుల్లో డైరెక్ట్ రిక్రూట్మెంట్ ద్వారా 220, లేటరల్ ఎంట్రీ ద్వారా 97 అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీకి విడివిడిగా నోటిఫికేషన్‌లు జారీ చేసింది. ఇందులో క్లినికల్, నాన్ క్లినికల్, సూపర్ స్పెషాలిటీ పోస్టులున్నాయి.

**97 లేటరల్ పోస్టుల నోటిఫికేషన్ కు 744 దరఖాస్తుల రాక :** డైరెక్ట్ రిక్రూట్మెంట్ పోస్టుల నోటిఫికేషన్ ప్రకారం 1,706, లేటరల్ ఎంట్రీ పోస్టుల నోటిఫికేషన్ అనుసరించి 744 చొప్పున అప్లికేషన్లు వచ్చాయి.
ఈ దరఖాస్తుల్ని పరిశీలించిన నియామక సంస్థ మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్, ఇతర ప్రభుత్వ నిబంధనలు అనుసరించి ఎంపిక జాబితాను ఖరారు చేసింది. డైరెక్ట్ రిక్రూట్మెంట్‌లో 155 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు, లేటరల్ ఎంట్రీ విధానంలో 61 పోస్టులకు అభ్యర్థుల్ని ఎంపిక చేసింది. ఈ జాబితాల ఆధారంగా శనివారంనాడు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని డీఎంఇ ( ఏఫ్ ఏ సీ )డాక్టర్ రాధికారెడ్డి తెలిపారు. కౌన్సిలింగ్ రోజునాడే పోస్టింగ్‌లు కూడా ఇస్తామని ఆమె తెలిపారు.

# ఖరీఫ్ రైతుకు అండగా రాష్ట్ర ప్రభుత్వం : మంత్రి అచ్చెన్నాయుడు

- రైతులకు సమృద్ధిగా విత్తనాలు, ఎరువులు, సాగునీరు
- ముందస్తు ప్రణాళికతో వ్యవసాయ రంగానికి పూర్తి మద్దతు
- మే 15 నుంచే దశలవారీగా సాగునీటి విడుదల
- రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమగ్ర ఏర్పాట్లు - వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : రాష్ట్రంలో ఖరీఫ్--2026 సీజన్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు వ్యవసాయశాఖ సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతోందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, సాగునీరు సమయానికి అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందన్నారు. 2026-27 సంవత్సరానికి రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా రూ. 294 కోట్ల బడ్జెట్‌తో 7.46 లక్షల క్వింటాళ్ల విత్తనాలను రైతులకు రాయితీపై సరఫరా చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించడం ద్వారా అధిక దిగుబడులు సాధించేలా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఖరీఫ్--2026 సీజన్‌కు అవసరమైన 93 వేల క్వింటాళ్ల పచ్చిరొట్ట ఎరువు విత్తనాలను గత సంవత్సరాల మాదిరిగానే 50 శాతం రాయితీపై సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే 30 వేల క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను సేకరించి రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీకి సిద్ధం చేసినట్లు చెప్పారు. మిగిలిన అవసరాల కోసం టీజీఎస్ డీసీ, హెచ్ఐఎల్, ఎన్ఎస్ సీ, ఆంగ్రూ సంస్థల ద్వారా అదనపు విత్తనాల సేకరణ చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.
ఈ ఏడాది 2.20 లక్షల క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను 40 శాతం రాయితీపై పంపిణీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. వేరుశనగ విత్తనాల సేకరణకు సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తయిందని, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా మే 20 నుంచి రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ ప్రారంభమవుతుందని చెప్పారు. అలాగే 1.62 లక్షల క్వింటాళ్ల వరి విత్తనాలను మే 15 నుంచి రాయితీపై రైతులకు అందజేయనున్నట్లు వెల్లడించారు. చిరుధాన్యాలు, అపరాలు తదితర ఇతర విత్తనాలను జూన్ 15 నుంచి రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఏపీ సీడ్స్ ద్వారా సరఫరా చేసే ప్రతి విత్తనాన్ని సంబంధిత ప్రయోగశాలల్లో నాణ్యతా పరీక్షలు నిర్వహించిన తరువాత మాత్రమే రైతు సేవా కేంద్రాలకు పంపిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలే అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.
2025-26 సంవత్సరం నుంచి గ్రామీణ విత్తనోత్పత్తి పథకానికి ప్రత్యామ్నాయంగా కొత్త విత్తన రకాల పెంపొందించడానికి తోడ్పాటు అనే సవరించిన సమగ్ర పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా ఇప్పటివరకు 1,03,901 క్వింటాళ్ల విత్తనోత్పత్తి జరిగిందని, 2026-27 సంవత్సరానికి 1,20,678 క్వింటాళ్ల విత్తనోత్పత్తి లక్ష్యంగా ప్రణాళిక రూపొందించామని చెప్పారు.
గత ప్రభుత్వం 2019-20 నుంచి 2023-24 వరకు రాయితీ విత్తనాలు సరఫరా చేసిన సంస్థలకు రూ. 476.94 కోట్ల బకాయిలు ఉంచిందని మంత్రి విమర్శించారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం 2024-25 సంవత్సరానికి సంబంధించిన పూర్తి చెల్లింపులు ఇప్పటికే విడుదల చేసిందని, 2025-26 సంవత్సరానికి సంబంధించిన చెల్లింపుల ప్రక్రియ కూడా కొనసాగుతోందని తెలిపారు. రైతులకు వివిధ పంటలపై ఆకర్షణీయమైన రాయితీలు కొనసాగిస్తున్నామని మంత్రి వెల్లడించారు. వరి విత్తనాలకు జిల్లాల వారీగా క్వింటాల్‌కు రూ. 500 నుంచి రూ. 1000 వరకు రాయితీ, చిరుధాన్యాలకు 50 శాతం, పప్పుధాన్యాలకు 30 శాతం, శనగలకు 25 శాతం, వేరుశనగ మరియు నువ్వులకు 40 శాతం, పచ్చిరొట్ట ఎరువు విత్తనాలకు 50 శాతం రాయితీ అందిస్తున్నట్లు తెలిపారు. ఏజెన్సీ మండలాల్లో గిరిజన రైతులకు 90 శాతం వం-కు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో 80 శాతం వరకు ప్రత్యేక రాయితీలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

**ఖరీఫ్ సీజన్‌కు ఎరువుల కొరత లేదు :** రాష్ట్రంలో ఖరీఫ్-2026 సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని రైతులకు అవసరమైన ఎరువులను సమృద్ధిగా అందుబాటులో ఉంచామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఎరువుల నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్రానికి ఖరీఫ్ 2026 సీజన్‌కు మొత్తం 18.09 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువుల కేటాయింపు ఉండగా, మే నెల వరకు ఇప్పటికే 3.44 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించబడినట్లు మంత్రి వెల్లడించారు. ఏప్రిల్ 1 నాటికి 7.13 లక్షల మెట్రిక్ టన్నుల ప్రారంభ నిల్వలు ఉండగా, ఇప్పటివరకు మరో 1.71 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు రాష్ట్రానికి చేరాయని తెలిపారు. దీంతో మొత్తం 8.84 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులోకి వచ్చినట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు 1.08 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు రైతులకు విక్రయించగా, ప్రస్తుతం రాష్ట్రంలో 7.77 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని మంత్రి వివరించారు. యూరియా 2.40 లక్షల మెట్రిక్ టన్నులు, డీఏపీ 0.94 లక్షల మెట్రిక్ టన్నులు, ఎంఓపీ 0.35 లక్షల మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 3.62 లక్షల మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ 0.46 లక్షల మెట్రిక్ టన్నుల మేర అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతుల అవసరాలను ముందుగానే అంచనా వేసి కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ ఎరువుల సరఫరాను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. జిల్లాల వారీగా నిల్వలు, సరఫరాపై అధికారులను అప్రమత్తంగా ఉండాలని ఆదేశించినట్లు చెప్పారు. ఎక్కడైనా కృత్రిమ కొరత సృష్టించే ప్రయత్నాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు అధీకృత ఎరువుల దుకాణాల నుంచే ఎరువులను కొనుగోలు చేయాలని, అధిక ధరలకు కొనవద్దని మంత్రి సూచించారు. రైతులకు అవసరమైన ప్రతి ఎరువు సమయానికి అందేలా ప్రభుత్వం పూర్తి స్థాయిలో చర్యలు చేపడుతోందని ఆయన స్పష్టం చేశారు.

**సాగుకు సమగ్ర నీటి ప్రణాళిక సిద్ధం :** ఖరీఫ్-2026 సీజన్‌కు రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి సరఫరాపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. రైతులకు సమయానికి సాగునీరు అందించేందుకు నీటిపారుదల శాఖతో సమన్వయం చేస్తూ సమగ్ర ప్రణాళిక అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రధాన, మధ్య తరహా సాగునీటి ప్రాజెక్టుల పరిధిలో నీటి లభ్యత, జలాశయాల్లో నిల్వలు, కాలువల మరమ్మతులు, ఖరీఫ్ అవసరాలను సమీక్షించిన అనంతరం మే 15 నుంచి దశలవారీగా సాగునీటి విడుదలకు ప్రభుత్వం సిద్ధమైందని మంత్రి వెల్లడించారు. ఖరీఫ్ పంటల సాగు సాధారణంగా జూన్ నుంచి ప్రారంభమై అక్టోబర్ వరకు కొనసాగుతుందని, వరి, మొక్కజొన్న, జొన్న, సజ్జ తదితర పంటలకు సమృద్ధిగా వర్షపాతం, సాగునీరు అవసరమవుతాయని తెలిపారు. ప్రతి జిల్లాలో నీటి లభ్యత ఆధారంగా ఇరిగేషన్ బోర్డు సమావేశాల్లో నీటి విడుదల తేదీలను ఖరారు చేస్తున్నట్లు పేర్కొన్నారు.
గోదావరి డెల్టా వ్యవస్థ పరిధిలో ప్రస్తుతం 51.67 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని మంత్రి తెలిపారు. జూన్ 30 వరకు ఖరీఫ్ అవసరాలకు 38.52 టీఎంసీలు అవసరమవుతాయని, మిగిలిన 13.15 టీఎంసీలతో జూలై 14 వం-కు సాగునీటి అవసరాలు తీర్చగలమని చెప్పారు. కాలువల మరమ్మతులు, సిల్ట్ తొలగింపు, కలుపు నివారణ పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయని తెలిపారు. కాలువల అభివృద్ధి పనులు చేపట్టినందున మే చివరి వరకు పనులు పూర్తి చేసి జూన్ 1 నుంచి నీటి విడుదల ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. కృష్ణా డెల్టా వ్యవస్థలో పులిచింతల ప్రాజెక్టులో ప్రస్తుతం 24.43 టీఎంసీల ప్రత్యక్ష నిల్వ ఉందని తెలిపారు. జూన్ నెల ప్రారంభ ఖరీఫ్ అవసరాలకు 18.22 టీఎంసీలు అవసరమవుతాయని చెప్పారు. తాగునీటి అవసరాలకు 4 టీఎంసీలు కేటాయించిన తర్వాత 2.21 టీఎంసీలు మిగులుతున్నాయని పేర్కొన్నారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ నుంచి ప్రస్తుతం అదనపు నీటి లభ్యత లేదని చెప్పారు. కాలువల నిర్వహణ పనులు మే 2 నుంచి ప్రారంభమయ్యాయని, జూన్ 1 నుంచి కృష్ణా తూర్పు డెల్టా, జూలై 1 నుంచి కృష్ణా పశ్చిమ డెల్టాకు నీటి విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల పరిధిలో ప్రస్తుతం 9.22 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని మంత్రి తెలిపారు. సాగు పనులు జూన్ రెండో వారంలో ప్రారంభమవుతాయని, వరి నాట్లు జూలై రెండో వారంలో ప్రారంభమయ్యే అవకాశముందని పేర్కొన్నారు. ప్రస్తుతం కాలువల నిర్వహణ పనులు వేగంగా జరుగుతున్నాయని వెల్లడించారు. కడప జిల్లాలోని ఐదు మధ్య తరహా ప్రాజెక్టుల్లో ప్రస్తుతం 3.905 టీఎంసీల నిల్వ ఉందని తెలిపారు. కాలువల వ్యవస్థ సక్రమంగా సిద్ధంగా ఉండడంతో మే 15 నుంచే నీటి విడుదలకు అవకాశం ఉందన్నారు. అనంతపురం జిల్లాలో గత పదేళ్లలో జూలైలోనే నీటి విడుదల ప్రారంభమైన దృష్ట్యా ఈ ఏడాది కూడా జూలై 17 ప్రాంతంలో నీటి విడుదల జరిగే అవకాశముందని తెలిపారు. తుంగభద్ర హై లెవల్ కాలువ (ఏపీ వాటా) పరిధిలో కూడా ప్రస్తుతం నీటి నిల్వలు పరిమితంగా ఉన్నాయని, గత అనుభవాల ప్రకారం జూలైలోనే నీటి విడుదల ప్రారంభమయ్యే అవకాశం ఉందన్నారు. నాగార్జునసాగర్ జలాశయంలో ప్రస్తుతం మొత్తం 27.07 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని, అందులో ఆంధ్రప్రదేశ్ వాటా 17.866 టీఎంసీలుగా ఉందని మంత్రి తెలిపారు. తాగునీరు, ప్రారంభ సాగు అవసరాల కోసం మే 15 నుంచి జూన్ 15 వరకు రోజుకు 7,000 క్యూసెక్కుల చొప్పున విడుదల చేసే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు.

**గత రెండేళ్లలో రికార్డు స్థాయిలో సాగు:** 2025-26 ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 99.35 లక్షల ఎకరాలకు సాగునీరు అందించగా, 887.90 టీఎంసీల నీటి వినియోగం జరిగినట్లు మంత్రి తెలిపారు.
అలాగే 2024-25 ఖరీఫ్‌లో 96.22 లక్షల ఎకరాలకు సాగునీరు అందించామని చెప్పారు. గోదావరి డెల్టా, కృష్ణా డెల్టా, నాగార్జునసాగర్, వంశధార, తాడిపూడి, ఎస్ఆర్‌బీసీ, తుంగభద్ర తదితర ప్రధాన ప్రాజెక్టుల ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు అందించినట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని రైతులకు ఖరీఫ్ సీజన్‌లో విత్తనాలు, ఎరువులు, సాగునీటి లభ్యతపై ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షణ నిర్వహిస్తోందని మంత్రి తెలిపారు.
ఎటువంటి నీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. వ్యవసాయ, నీటిపారుదల శాఖలు సమన్వయంతో పనిచేస్తూ రైతులకు పూర్తి మద్దతు అందిస్తాయని ఆయన స్పష్టం చేశారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467